ఘనంగా జర్నలిస్టు కాలనీ గణపతి నిమజ్జనం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



జిన్నారం మండలంలోని కాజిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల న్యూ జర్నలిస్టు కాలనీలో మంగళవారం గణపతి నిమజ్జోత్సవ కార్యక్రమాన్ని జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆపై నిమజ్జన సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కాజిపల్లి గ్రామానికి చెందిన యువత నాయకుడు కుమార్ యాదవ్ వేలంపాటలో రూ.70 వేలకు గణపతి మహా లడ్డును సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా జర్నలిస్టు సభ్యులు కుమార్ యాదవ్‌కు ఘనంగా సన్మానించి లడ్డును బహుకరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్థానిక చెరువులో మహాగణపతి నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, కాజిపల్లి మాజీ సర్పంచ్ గడ్డె నరసింహ, జర్నలిస్టు ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్లు తెగిపడి రెండు పాడిగేదెలు మృత్యువాత

నవతెలంగాణ-న్యాల్‌కల్



ఇంటి దగ్గర కట్టేసి ఉన్న పాడిగేదెలపై విద్యుత్ వైర్లు తెగిపడడంతో.. రెండు గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన న్యాల్కల్ మండంలోని మిర్జాపూర్(బి) గ్రామంలో మంగళవా రం ఉదయం జరిగింది. బాధిత రైతు ఇస్మాయిల్ ఖురేసి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖురేసి రోజులాగానే తన పాడి గేదెలను ఇంటికి తీసుకువచ్చి ఆరుబయట కట్టేశాడు. అయితే పక్కనే ఉన్న స్తంభంపై నుంచి విద్యుత్ వైరు తెగి.. గేదెలపై పడడంతో రెండు పాడిగేదెలె అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృత్యువాత పడిన గేదెల విలువ సుమారు రూ.1,50,000 ఉంటుందని బాధిత రైతు వాపోతున్నాడు. తన జీవానాధరం కోల్పోయానని.. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

విషయం తెలియగానే విద్యుత్ ఏఈ అర్జున్, మిర్జాపూర్ (బి) ఇన్చార్జి వెటర్నరీ డాక్టర్ గణేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డెత్ పోస్టుమార్టం ద్వారా నష్టం అంచనా వేసి విద్యుత్ అధికారులకు రిపోర్ట్ చేస్తామని పశు వైద్యాధికారి గణేష్ కుమార్ తెలిపారు.

అమీన్‌పూర్‌లో వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-అమీన్‌పూర్



ఇంటినుంచి పనికోసం వెళ్లిన ఓ తాపీ మేస్త్రీ అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బీరంగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరంగూడ పరిధిలోని ఇసుకబావికి చెందిన అడ్డాల జయరాజ్ తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8వ తేదీన ఉదయం 8 గంటల సమయంలో రోజువారీ లాగే ఇంటి నుంచి తాపీ పని కోసం వెళ్లి.. తిరిగి ఇంటికి రాలేదు. ఎంత ఎదురుచూసినా.. చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ దొరకలేదు. దాంతో జయరాజ్ భార్య అడ్డాల లలిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అమీన్‌పూర్ ఎస్ఐ కే.సోమేశ్వరి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చౌటకూర్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-చౌటకూర్



తూప్రాన్‌లోని సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడు మంది బాలురు, బాలికల విభాగంలో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఖమ్మంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చెత్తాచెదారం వెంటవెంటనే తీసివేయాలి

నవతెలంగాణ-జోగిపేట



అందోల్-జోగిపేట మున్సిపల్ పట్టణాన్ని చెత్తాచెదారం రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కార్మికులు అంకితభావంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. మంగళవారం ఉదయం పారిశుద్ధ పనులను పరిశీలించారు. మెయిన్ రోడ్డుపై మట్టి తొలగింపు పనులు, రోడ్ల క్లీన్ చేసే పనులను పరిశీలించారు. వాటర్ సప్లై పనులను కూడా పర్యవేక్షించారు. మున్సిపల్ కార్మికులు పచ్చదనం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్మికులకు అప్పగించిన పనులను తూచా తప్పకుండా చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ ఉన్నారు.

ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న వి.ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాలిటీ యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు మంగళవారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రవీణ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఏటా మహాగణపతిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యువజన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్కల్ నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌ను పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీపీ సిబ్బంది శాలువా పూలమాలతో సన్మానించి స్వాగతించారు. నాగలిగిద్ద మండలం నుంచి ప్రమోషన్‌పై ఆయన ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలు, నాయకుల సమన్వయంతో పనిచేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల ఎంపీఓ సురేష్, పంచాయతీ సెక్రటరీలు సంతోష్, కృష్ణ ప్రతాప్ రెడ్డి, దయానంద్, సరిన్, సిబ్బంది ఉన్నారు.

అపరిచితులు వస్తే సమాచారం ఇవ్వండి

నవతెలంగాణ-న్యాల్‌కల్

గ్రామాల్లో బజాజ్ ఎలక్ట్రికల్ ఫైనాన్స్ పేరిట తక్కువ ధరకు ఎలక్ట్రికల్ వస్తువులు ఇప్పిస్తామని కొందరు మోసాలకు పాల్పడుతున్నారని.. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హద్నూర్ ఎస్సై రామునాయుడు తెలిపారు. అపరిచితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు



నవతెలంగాణ-జహీరాబాద్

వినాయక నిమజ్జనం నేపథ్యంలో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్టు ఆర్అండ్‌బి డి.శ్రీనివాస్ తెలిపారు. జహీరాబాద్-అల్గోల్ మధ్యలో గల ఆర్అండ్‌బి బిటి రోడ్ చాలా మట్టుకు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కొన్ని టెక్నికల్ సమస్యల వల్ల ఎలక్ట్రికల్, డ్రయినేజీ సిస్టం సరిగా లేనందున వర్షం నీరు మొత్తం రోడ్లపైకి వచ్చి రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. అయితే రెండ్రోజుల్లో వినాయక నిమజ్జనం ఉండడంతో.. ప్రజలు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మత్తులు చేపడుతున్న అధికారుల కు ఇబ్బందులు రాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్గర నుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు పి.నరసింహ రెడ్డి, నాయకులు అక్బర్ హుస్సేన్, మొహమ్మద్ జమీలోదిన్ మొగుడంపల్లి మండల మాజీ ఎంపీపీ గుండారెడ్డి, మామిడిగి మాజీ ఎంపిటిసి గుండారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు %+%. మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా భూమి.. మాకు ఇప్పించండి..

- సీపీ అనురాధకు వినతిపత్రమందజేసిన బాధితులు
- పెత్తందారులకు అండగా పోలీసులు నిలుస్తున్నారని అవేదన

నవతెలంగాణ-మిరుదొడ్డి

గత కొన్ని ఎండ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని కొందరు కబ్జా చేశారని. మా భూమిని మాకు ఇప్పించాలని మిరుదొడ్డి గ్రామానికి చెందిన దళిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. మాముళ్లతో పోలీసులు పెత్తందారులకు వత్తాసు పలుకుతున్నారని బాధితులు ఆక్రోశం వెళ్లగక్కుతూ మంగళవారం సీపీ అనురాధకు వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా బాధితులు తమ అవేదనను వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణం వద్ద దళితుల భూమిని కొంతమంది పెత్తందారులు భూమిని కబ్జా చేయానికి యత్నిస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితులు అవేదన వ్యక్తం చేశారు. బాధితులు కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చిన దౌర్జనంగా రేకులతో షెడ్డు నిర్మించి కబ్జా చేశారని అసహనం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై పెత్తందారులు పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వేడుకున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

మున్సిపాల్టీలోకి ఆరు గ్రామాలు

- మిగిలిపోయిన రెండు ఊర్లు..
- పటాన్‌చెరులోకా.. జిన్నారం లోకా..?





నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఆరు గ్రామాలు విలీనం అయ్యాయి. ఔటర్ రింగురోడ్డు పరిధిలోని గ్రామాలను సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఇటీవల తెలంగాణ సర్కారు గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ గెజిట్ నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వచ్చింది. అందులో భాగంగానే అమీన్‌పూర్ మండలంలో 8 గ్రామాలు ఉంటే.. అందులో ఆరు గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం కాగా, మరో రెండు గ్రామాలు వడక్ పల్లి, జనాకంపేట్‌లు గ్రామపంచాయతీలోనే మిగిలిపోయాయి. అయితే ఈ రెండు గ్రామాలను పటాన్‌చెరు మండలంలో కలపాలా..? లేక జిన్నారం మండలంలో కలపాలా..? అన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. తాజాగా అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి సదరు గ్రామపంచాయతీ కార్యాలయాలను పరిశీలించి మున్సిపాల్టీ పరిధిలోకి తీసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలపై పేర్లు మార్చడంతో పాటు రికార్డులు సైతం మున్సిపల్ అధికారుల చేతుల్లోకి వచ్చాయి. అమీన్ పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్ గూడా, ఐలాపూర్, ఐలాపూర్ తాండ,సుల్తాన్ పూర్, దయారా గ్రామపంచాయతీలను అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.కొత్తగా చేరుతున్న గ్రామాలను 24 వార్డులుగా విభజించారు. ఇప్పటికే అమీన్ పూర్ మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా, కొత్తగా చేరిన గ్రామాలతో వార్డుల సంఖ్య 48కి చేరనుంది. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఎనిమిది గ్రామపంచాయతీలు మున్సిపాల్టీలో విలీనం కావడంతో అమీన్‌పూర్ మండలం దాదాపుగా కనుమరుగయ్యిందనే చెప్పాలి. మండలంలో ఉన్న 8 గ్రామాల్లో 6 గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపాలిటీలోకి.. మరో రెండు గ్రామాలు వడక్ పల్లి, జనాకంపేట్ గ్రామపంచాయతీలుగా మిగిలిపోవడం.. త్వరలోనే వీటిని పటాన్‌చెరు లేదా జిన్నారం మండలంలో కలిపే అవకాశం ఉండడంతో అమీన్‌పూర్ మండల చరిత్ర ముగిసిపోయింది. ఇదిలావుంటే.. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం అయిన ఆరు గ్రామాల్లో మంగళవారం నుంచి పురపాలన షురూ అయ్యింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలు విలీనం:

- జ్యోతిరెడ్డి, కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అమీన్‌పూర్ మండల పరిధిలోని ఆరు గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశాం. మంగళవారం నుండి పూర్తిస్థాయిలో మున్సిపల్ పరిపాలన ప్రారంభమయ్యింది. ప్రజల అవసరాల నిమిత్తం కొద్ది రోజులపాటు ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రజలు ఏలాంటి అసౌకర్యాలకు గురికావాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్య ఉంటే.. మున్సిపల్ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

ప్రారంభమైన పురపాలిక పాలన..

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 11 గ్రామాల్లో పురపాలిక పాలన మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విధితమే. ఇందుకు అనుగు ణంగానే పటాన్‌చెరు మండల పరిధిలోని 5 గ్రామాలు పాటి, కర్దనూరు, ఘనాపూర్, ముత్తంగి, పోచారం గ్రామాలు తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనమవ్వగా,అమీన్పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తాండ, పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్పూర్, దాయర, గ్రామాలు అమీన్పూర్ మున్సిపాల్టీలో విలీనమయ్యాయి. మంగళవారం ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు సంగారెడ్డి, జ్యోతిరెడ్డిలు గ్రామపంచాయతీ అధికారులతో సమావేశమై రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామపంచాయతీ బోర్డులను సైతం మున్సిపాలిటీలుగా మార్చారు. ప్రస్తుతం పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను మున్సిపాలిటీలలో కొనసాగడానికి ఇష్టంగా ఉన్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పటాన్‌చెరు, అమీన్పూర్ మండల పరిధిలోని11 గ్రామపంచాయతీలను మున్సిపాల్టీల్లో విలీనం చేయడం జరిగిందన్నారు. నేటి నుండి పూర్తిస్థాయిలోమున్సిపల్ పాలన ప్రారంభమవుతుందన్నారు.

తెల్లాపూర్ మున్సిపాల్టీలోకి 5 గ్రామాలు విలీనం

నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరు మండలానికి చెందిన పాటీ, ఘన్పూర్, కర్దనూర్, ముత్తంగి, పోచారం 5 గ్రామాలు మంగళవారం నుంచి తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గానికి సంబంధించిన తెల్లాపూర్, అమీన్పూర్ మున్సిపాల్టీ పరిధిలోకి 11 గ్రామాలు తెచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో భాగంగా తెల్లాపూర్ మున్సిపాల్టీలోకి పటాన్చెరు మండలానికి చెందిన 5 గ్రామ పంచాయ తీలు చేరాయి. అమీన్పూర్ మండలానికి చెందిన కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, దాయెర, సుల్తాన్పూర్, ఐలాపూర్, ఐలాపూర్ తాండా 6 గ్రామాలు అమీన్పూర్ మున్సిపాలిటీలో కలిసాయి. దీంతో గ్రామ పంచాయతీ రికార్డులన్నీ ఇక మున్సిపాలిటీలోకి స్వాధీనం కానున్నాయి. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పంచాయతీ కార్యాలయంలో ఉండే అన్ని రకాల రికార్డులను స్వాధీనం చేసుకునే సమయంలో మండల పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారుల సంతకాలు తీసుకొని పూర్తిగా మున్సిపాల్టీకి అప్పజెప్పనున్నారు. గ్రామపంచాయతీలలో పనిచేసే సిబ్బందిని వారి సమ్మతం మేరకు నూతనంగా విలీనమైన మున్సిపాల్టీలో కొనసాగించేలా లేదంటే ఇతర గ్రామపంచాయతీలలో నియమించే అవకాశాలు ఉన్నాయి. నేటి నుండి ఆయా గ్రామ పంచాయతీల్లో మున్సిపాల్టీ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో రాజకీయ చదరంగం సైతం మార్పులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపాల్టీలపై పట్టు కోసం అన్ని రాజకీయ పార్టీలు.. నూతనంగా చేరిన గ్రామపంచాయతీ రాజకీయ నాయకులు సైతం ఎవరికి వారు ముందస్తుగా ప్రయత్నాల్లో ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- జహీరాబాద్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో 140 కిలోల ఎండుగంజాయి స్వాధీనం
- అదుపులోకి ఇద్దరు వ్యక్తులు..
- బొలేరో వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు, నాలుగ్ సిమ్‌కార్డ్స్ సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-జహీరాబాద్

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. అక్రమ వ్యాపారాలు చేసేవారు ఎంతటి వారైనా ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ వాహనం నుంచి 140 కిలోల ఎండుగంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తన సిబ్బంది, సీసీఎస్ సిబ్బందితో కలిసి చిరాగ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో గల ఆనంద్ ధాబా ఎదుట ఎన్‌హెచ్-65 రోడ్‌పై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అనుమానాస్ప దంగా వస్తున్న తెలుపు రంగు మహీంద్ర బొలెరో పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తుండగా.. వాహనం కింది భాగంలో చెక్కలు ఏర్పాటు చేసి వాటి కింద ఎండు గంజాయి ప్యాకెట్లను పెట్టినట్టు పోలీసులు గుర్తించారు. 140 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని.. వాహనంలోని లఖన్, సిద్దిరామ్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి సరఫరా ఇలా..

కర్ణాటక రాష్ట్రంలోని బాల్కికి చెందిన మల్లుగొండ అనే నేర ప్రవృత్తి గల వ్యక్తి నిషేధిత ఎండు గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి రాహుల్ అనే వ్యక్తి ద్వారా సేకరిస్తాడు. ఆ గంజాయిని బాల్కికి చెందిన లఖన్, సిద్దిరామ్, సునిల్, కిరణ్ , మల్లేశ్ నాయక్‌ల ద్వారా కార్లలో, బొలెరో వాహనాల్లో తన వద్దకు చేర్చుకుంటాడు. అనంతరం ఆ గంజాయిని మహారాష్ట్రలోని ముంబై, పూణే, లాతూర్ లాంటి పెద్దపెద్ద పట్టణాల్లో ఎక్కువ ధరకు విక్రయించి అక్రమమార్గంలో డబ్బులు సంపాదిస్తాడు. ఈ క్రమంలో తాజాగా గంజాయిని తరలిస్తుండగా ఇక్కడి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్టు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన డ్రైవర్ లఖన్, సహచరుడు సిద్దిరామ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా నిందితులు మల్లుగొండ, రాహుల్, కిరణ్, సునిల్ మల్లెశ నాయక్‌లు పరారీలో ఉన్నారన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మిగాత వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి.. రివార్డ్‌లు ప్రకటించారు. ఈ విలేకర్ల సమావేశంలో డీఎస్పీ కే.రామ్‌మోహన్‌రెడ్డి, జహీరాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యస్. శివలింగం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ రమేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, చిరగ్ పల్లి ఎస్ఐ కె. రాజేందర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మాణిక్ రెడ్డి, ఏఎస్ఐ, సీసీఎస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యం

- తోషిబా గేట్‌మీటింగ్‌లో యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్
- తోషిబాలో సీఐటీయూ గెలుపు లాంచనమే అని ఆశాభావం
- తోషిబాలో నేడే కార్మిక సంఘం ఎన్నికలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మిక చట్టాలపై ఇతర కార్మిక సంఘాలకు ఏమాత్రం అవగాహన లేదని, కార్మిక చట్టాలపై పూర్తి అవగాహన ఉన్న సీటీయూనే అనేక పరిశ్రమల్లో కార్మికులు అక్కున చేర్చుకుంటు న్నారని తోషిబా యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ అన్నారు. తోషిబా పరిశ్రమలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో మల్లికార్జున్ మాట్లాడుతూ.. తోషిబా లో సీఐటీయూ గెలవడం లాంఛనమేనన్నారు. కార్మికులకు కష్ట సుఖాల్లో అండగా ఉంటూ చట్టాల గురించి తెలిసిన వారు సీఐటీయూ నాయకులన్నారు. కార్మికుల పక్షాన చట్టాలను పూర్తిగా అమలయ్యేవిధంగా చూస్తున్నట్లు, మిగతా యూనియన్లకు కార్మిక చట్టాల గురించి ఏమాత్రం అవగాహన లేదని, ఐఎన్టీయూసీ, బిఎంఎస్ నాయకులు యజమానులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల రక్షణ సీఐటీయూ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అనేక పరిశ్రమలలో చారితత్మ కమైన వేతన ఒప్పందలు సీఐటీయకే సాధ్యమవుతున్నాయన్నారు. సీఐటీయూ ఉంటేనే కార్మిక సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. నేడు తోషిబా పరిశ్రమలో జరిగే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి మల్లేశం, ఉపాధ్యక్షులు కే రాజయ్య, యూనియన్ సెక్రెటరీ అనంతరావు, సినర్జీ నాయకులు శాంతారావు, పాండు రంగారెడ్డి, వీఎస్ రాజు, వేణుగోపాల్, సాయిలు, శ్రీనివాసరెడ్డి, తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్ ,బంగారాజు, లోకేష్, పుల్లమ్ రాజు, వెంకటేశ్వరరావు, నరేష్, ధనరాజ్, యుగేందర్ పాల్గొన్నారు.

కల్హేర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డీసీహెచ్‌ఎస్ తనిఖీ

నవతెలంగాణ-కల్హేర్



మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దస్త్రావేజులను, రికార్డులను, సిబ్బంది హాజరు తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న ఓపి సేవలను, డెలివరీస్ గురించి స్థానిక వైద్యులు డాక్టర్ అనిల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు జ్వరం సర్వే నిర్వహించాలన్నారు. డ్రైడే పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్న గ్రామాల్లో వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనిల్ రెడ్డి, సూపర్వైజర్ మాణిక్యం, ఫార్మసిస్ట్ జబ్బర్, డీఈఓ అంజి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు, తదితర సిబ్బంది, పాల్గొన్నారు.

అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలి

- గతంలో పీఎంఓకు వినతి..
- తాజాగా పీఎంఓ నుంచి జోగినాథ్‌కు ఫోన్ కాల్, లేఖ.

నవతెలంగాణ-జోగిపేట



అధ్వానంగా మారిన అల్లాదుర్గం-మెటల్‌కుంట రహదారికి మంచి రోజులు రానున్నాయని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గంగా జోగినాథ్ గుప్తా అన్నారు. మంగళవారం ఆయన జోగిపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్ రాష్ట్ర రహదారి అయిన అల్లాదుర్గం-మెటల్ కుంట రహదారి పూర్తిగా ధ్వంసం అయిన విషయం పాఠకులకు విధితమే అన్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి పునర్నిర్మించాలని, దిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయానికి, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయానికి వెళ్ళి వినతిపత్రాలు అందించానన్నారు. దానిపై ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందన్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారి (నేషనల్ హైవే)గా మార్చేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా.. కేంద్ర ఉపరితల రవాణా శాఖ రీజినల్ ఆఫీసర్ (ఆర్ఓ) కృష్ణ ప్రసాద్.. రాష్ట్ర నేషనల్ హై వే ఈ ఎస్ సీ కి ఆదేశాలను జారీ చేశారని వివరించారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్, దామోదర్ రాజనర్సింహ, ఎంపీ లు రఘునందన్ రావు, సురేష్ శెట్కార్, మాజీ ఎంపీ బీ బీ పాటిల్ చొరవ చూపారని, మరింతగా వారు ప్రయత్నిస్తే త్వరలోనే ఈ రోడ్డు జాతీయ రహదారిగా గుర్తింపబడి, పునర్నిర్మించబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రజా ప్రతినిధుల తో పాటు కేంద్ర, రాష్ట్ర జాతీయ రహదారుల సంస్థ అధికారులకు గంగా జోగినాథ్ ధన్యవాదాలు తెలిపారు.

మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతి

- జాతీయ వైద్య విధాన పరిషత్ గ్రీన్ సిగ్నల్
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర కృషి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతి లభించింది. వైద్య విధాన పరిషత్ నుంచి అనుమతి వస్తుందో రాదో అన్న అనుమానాలు తీరాయి. ఇప్పటికే సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలున్నాయి. మెదక్ జిల్లా కేంద్రంలోనూ ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైంది. అయితే కేంద్ర వైద్య విధాన పరిషత్ పలుమార్లు పరిశీలించి అనుమతి నిరాకరించింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన పలు మార్గదర్శకాల మేరకు అనుమతులు లభిస్తాయి. అయితే కొన్ని అంశాల్లో లోపాలను గుర్తించిన వైద్య విధాన పరిషత్ మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు అడ్మిషన్లు ఉండవని బావిస్తున్న వేళ అధికారులు పలు మార్లు అనుమతి కోసం ప్రయత్నించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా కృషితో ఎట్టకేలకు వైద్య విధాన పరిషత్ నుంచి అనుమతి లభించడం విశేషం. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పద్మాదేవెందర్‌రెడ్డి పట్టుబట్టి మెడికల్ కళాశాలను మంజూరు చేయించారు. కళాశాలకు శంఖుస్థాపన చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో మెదక్ మెడికల్ కళాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తుందో లేదో అన్న విషయం చర్చ జరిగింది. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇతర అధికారులు మెడికల్ కళాశాల అనుమతుల కోసం ప్రత్యేకంగా దృష్టి సారించి కృషి చేశారు. పాత కలెక్టరేట్‌లో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్‌ను వేరే చోటికి మార్చి మెడికల్ కళాశాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అయితే అప్పట్లో పరిశీలనకు వచ్చిన వైద్య విధాన పరిషత్ అనుమతి ఇవ్వడంలో జాప్యం చేసింది. వైద్య కళాశాలకు అవసరమైన సౌకర్యాలు లేని కారణంగానే అనుమతి రాలేదు. ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్ల సమయం సమీపిస్తుండడం, మరో పక్క వైద్య విధాన పరిషత్ అనుమతి ఇవ్వకపోవడంతో మెదక్ మెడికల్ కళాశాల ప్రశ్నార్థకం అనుకున్నారు. అయితే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా మెదక్ మెడికల్ కళాశాల కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. ఇటీవల జిల్లా సమీక్షా సమావేశానికి వెళ్లి సయంలో మెదక్ జిల్లా ప్రజా ప్రతినిధులు ముఖ్యకంఠంతో మెడికల్ కళాశాలకు అనుమతులు వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు. అధికారులు, మంత్రి ప్రయత్నాలు ఫలించడంతో ఎట్టకేలకు మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతులు రావడంతో జిల్లా ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుంది.

ప్రజలకు అధునాతన వైద్యం: రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్

మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వైద్య విధాన పరిషత్ అనుమతులు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషి వల్ల మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాల వచ్చింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా మార్గదర్శకంలో అధికారులు, ప్రిన్సిపాల్ పట్టుదలతో చేసిన కృషి వల్లనే అనుమతులు సాధ్యమయ్యాయి. మెడికల్ కళాశాల రావడంతో జిల్లా ప్రజలకు మెరుగైన అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

స్థానికులకు ఉద్యోగంతో పాటు భద్రత కల్పించాలి

- పరిశ్రమ ఎదుట కార్మికులు నిరసన, దీక్ష

నవతెలంగాణ-హత్నూర



స్థానికులకు ఉద్యోగంతో పాటు భద్రత కల్పించాలంటూ సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని ఏపిటోరియం యూనిట్ 1 పరిశ్రమ ఎదుట కార్మికులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. పరిశ్రమ ఎదుట బైఠాయించి.. తమకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ఉద్యోగ భద్రతపై హామీ ఇచ్చేవరకు నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించారు. కొన్నేండ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్నా.. స్థానిక కార్మికులను కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులను పర్మినెంట్ చేయడంపై మండిపడ్డారు. మొదటి ప్రియార్టీగా స్థానికులకు పర్మినెంట్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసి.. జిన్నారం సిఐ సుధీర్ కుమార్, ఎస్సై సుభాష్ సిబ్బందితో పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులకు యాజమాన్యంతో సమస్య పరిష్కరించుకునే విధంగా సామరస్యంగా ఉండాలని సూచించారు. కాగా పరిశ్రమ యాజమాన్యం స్పందించకపోవడంతో నిరసన దీక్ష కొనసాగుతుందని కార్మికులు తెలిపారు. నిరసన దీక్షకు బీజేపీ మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్ మద్దతు తెలుపి మాట్లాడారు. పరిశ్రమ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనియెడల పరిశ్రమ యజమాన్యం దిగి వచ్చేవరకు కార్మికులకు పూర్తి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఆంజనేయులు, రామకృష్ణ, రమేష్,సాయిరాం, కమలాకర్, చంద్రశేఖర్, శ్రీశైలం, ప్రవీణ్, గంగారం, శివకుమార్, మధు, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



కిశోర బాలికల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ,మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల స్పెషల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్నాపూర్ రెసిడెన్షియల్ పాఠశాల, చిట్కుల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ.. ఆరోగ్యం మరియు ఆహార భద్రత మరియు మినిస్ట్రియల్ హైజీన్ మేనేజ్మెంట్ మరియు కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికల రక్షణ భద్రత చట్టాలను గురించి తెలియజేశారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రక్తహీనత అనేక సమస్యలకు దారితీస్తుందని రక్తహీనత తగ్గించడానికి సరైన పోషకాహారాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని ఆరోగ్య విషయంలో ప్రత్యేకమైన జాగ్రత్త అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుష్మా పూజిత, పాఠశాల ప్రిన్సిపల్స్, విశాల, ఆశలు,అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

నవతెలంగాణ-సంగారెడ్డి



హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మెదక్ జిల్లా సెక్రటరీ విజయకుమార్ పర్యవేక్షణలో సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపికలు చేశారు. అందులో సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె. అంథోని రెడ్డి మాట్లాడుతూ ఆద్విక్, ప్రద్యుమ్న పారస్ లాల్, ధనుష్‌లు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికకావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మానసిక వికాసానికి, దేహధారుడ్యానికి ఎంతో అవసరం అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎంపికైనందుకు హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంపూర్ణ కృషి, సహకారం అందించిన పీఈటీ మాస్టర్ విశాల్, సంతోష్‌లను అభినందించారు.

ఖేడ్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్, మనూర్



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్ సభ్యులుగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా.పి.సంజీవ్‌రెడ్డి ఎన్నికైనందున కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.రాజు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ టీపీసీసీ అధ్యక్షునిగా ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అకౌంట్ సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యేకు మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దత్తు బీరదార్ విష్ణు వర్ధన్‌రెడ్డి, సిద్ధారెడ్డి రాజు తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి నుండి 9వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి రేపు(గురువారం) స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు జోనల్ అధికారిణి నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతికొద్దీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్టు చెప్పారు. కేవలం అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు మాత్రమే ఈనెల 12వ తేదీన ఇస్నాపూర్ పాఠశాలలో నిర్వహించే కౌన్సిలింగుకు హాజరుకావాలన్నారు. ఇందులో 2024-25లో వీజి సెట్, బిఎల్‌వి సెట్ రాసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. అప్లికేషన్లు రేపు ఉదయం 10 గంటల నుంచి రెండు గంటల వరకు మాత్రమే తీసుకోవడం జరుగుతుందన్నారు. స్పాట్ అడ్మిషన్లు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ కేంద్రానికి హాజరుకావాలన్నారు.

వినయ పాటిల్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-జహీరాబాద్



మండలంలోని అల్గోల్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినయ పాటిల్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ వారు ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును అందజేశారు. రెడ్‌క్రాస్ హైదరాబాద్ డిస్టిక్ చైర్మెన్ మామిడి భీమ్‌రెడ్డి అధ్యక్షతన ఆర్‌బివిఆర్‌ఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల నారాయణగూడలో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వినయా పాటిల్ ఈ అవార్డును అందుకున్నారు. ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి , తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా ఆమెకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినా మిస్ ఇండియా 2024 సూర్య రేవతి, మాజీ రెడ్‌క్రాస్ తెలంగాణ చైర్మన్ దేశ ప్రకాష్‌రెడ్డి, సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా 24 కు గ్రామీణ విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-వట్‌పల్లి

హైదరాబాదులోని రమాదేవి పబ్లిక్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన ఉషా కిరణ్, శివరాం రెడ్డి దంపతుల కుమార్తె మయంసిరెడ్డి ఖేలో ఇండియా గేమ్స్-24కి ఎంపికయింది. తమిళనాడులో జరిగిన ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్న మెంటులో అండర్ 14గర్ల్స్ విభాగం నుంచి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే ఖేలో ఇండియా-24కి ఎంపికైంది. దాంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు మయంసికను అభినందించారు.

గీతంలో ఫార్మసీ విద్యార్థులకు ఉత్తేజకర పోటీలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం- 2024 (ఈనెల 25న) పురస్కరిం చుకుని ఫార్మసీ విద్యార్థుల కోసం. ఆకర్షణీయమైన పోటీలను నిర్వహించాలని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ సంకల్పించింది. ఈ పోటీల్లో వ్యాస రచన, పోస్టర్ ప్రదర్శన, మౌఖిక ప్రదర్శన, క్విజ్ నంటిని ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఫార్మసిస్టులు కీలక భూమిక పోషిస్తున్న విషయాన్ని ప్రస్ఫుటం చేసే లక్ష్యంతో వీటిని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని డాక్టర్ శివకుమార్ తెలియ జేశారు. వ్యాస రచన పోటీలలో పాల్గొనేవారు ప్రపంచ ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర, టెలిఫార్మసీ వంటి అంశాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. సురక్షితమైన ఔషధ వినియోగ పద్ధతులు, గ్రామీణ ఆరోగ్యంలో అంతరాన్ని తగ్గించడం, మానసిక ఆరోగ్యానికి ప్రపంచ సహకారం వంటి విషయాలపై పోస్టర్ ప్రదర్శనను రూపొందించవచ్చని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య విధానం, ఇతర సంబంధిత రంగాల్లో ఫార్మాసిస్టుల నాయకత్వంపై మౌఖిక ప్రదర్శన చేయొచ్చన్నారు. ముగ్గురు లేదా నలుగురు జట్టుగా (విడివిడిగా పేర్లు. నమోదు చేసుకోవాలి) గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ప్రత్యక్షంగా నిర్వహించే క్విజ్ పోటీలలో పాల్గొనాలని చెప్పారు. ఆసక్తి గల ఫార్మసీ విద్యార్థులు తమ ఎంట్రీలను gpsa_hyd@gitam.in ఈ-మెయిల్ ద్వారా సమర్పించాలని, విజేతలకు ఉత్తేజకర బహుమతులు, అవార్డులను ప్రదానం చేస్తామని ప్రొఫెసర్ శివకుమార్ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థి సమన్వయకర్తలను (7330778199 లేదా8977714744) సంప్రదించాలని సూచించారు.

6వ వార్డులో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో గల 6వ వార్డు కెబిఆర్ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బొల్లారం మున్సిపల్ చైర్మెన్ కొలన్ రోజాబాల్ ండ్డి, స్థానిక ఆరో వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డిలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నిర్మాల రెడ్డి, ఏఈ కిష్టయ్య, ప్రశాంత్, కాంట్రాక్టర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా సదస్సు

నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు మంగళవారం రోజున అవగాహన శిక్షణ సమావేశాన్ని నిర్వహించినట్టు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. మండల ఎంఈఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యమంలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల, ఉపాధ్యాయుల సంఖ్య, వివరాలను ఆన్లైన్ పొందుపరచడం గురించి ఆర్పీలు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మారుతి రాథోడ్, ఆర్పీలు మురళి, మండల నూడల్ ఆఫీసర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం జోగిపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ బసవ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, రాములు, అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశత్వానికి ఎదురొడ్డిన వీరవనిత చాకలి ఐలమ్మ

తెలంగాణ తొలి భూ పోరాట వనిత, నిజాం రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఉద్యమ కాగడా చాకలి ఐలమ్మ వర్థంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ గురించి కొనియాడారు. ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని.. మహిళలు వారిపై జరిగే దాడులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.







నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపైన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని.. తఐలమ్మ చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారన్నారు. నేటి తరానికి వారి చరిత్రను తెలిపేలా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్ కుమార్, నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు నరసింహారెడ్డి, రజక సంఘం అధ్యక్షులు మహేష్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్‌లో ఐలమ్మ కాంస్య విగ్రహానికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ..నిజాం రజాకార్ల నిరంకుశ పాలనలో వెట్టి చాకిరితో మగ్గిపోయిన పేద బతుకులను బాగు చేయడానికి, బడుగు జీవుల అస్తిత్వాన్ని పరిరక్షించడానికి బందుకులు పట్టి సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో దేశంలోనే అతి పెద్ద కాంస్య విగ్రహాన్ని చిట్కుల్ గ్రామంలో ప్రతిష్టించామని గుర్తు చేశారు. ఆమె స్ఫూర్తితో సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసమే తాను ఎల్లప్పుడూ కృషి చేస్తూ స్వచ్ఛంధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మన రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాకలి వెంకటేష్, మాజి సర్పంచ్ సుంకరి రవీందర్, మాజి ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,వి నారాయణరెడ్డి,పొట్టి నారాయణరెడ్డి, కృష్ణ,మురళీ,వెంకటేష్, సత్యానారాయణ, బాబు, కిషోర్, రజకసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : ఐలమ్మ వర్ధంతి సందర్బంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆమె విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాయుధ పోరాటం చేసిందని గుర్తు చేశారు. తన పంటను కాపాడుకోవడానికి పెత్తందారులపై తిరుగుబాటు చేసిన గొప్ప వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. అలాంటి వీరవనిత స్ఫూర్తితో అనేక ఉద్యమాల పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, సాయిలు, నాయకులు యాదగిరి, నర్సింలు, రాజయ్య, అశోక్, రమేష్ గౌడ్, కృష్ణ, బాలరాజు, శివ, బాబూరావు, మహేశ్, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, దత్తు, ప్రవీణ్, మని, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం తరపున స్థానిక కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాపిరి నాంది పలికింది చిట్యాల ఐలమ్మ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహనికి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ఉపాధ్యక్షులు సజ్జద్‌ఖాన్ ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్‌కుమార్, సహా కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలవేసి ఘన నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ గౌరవ అధ్యక్షులు, ఆంజనేయులు, ఉపాధ్యక్షులు శ్రీశైలం, ప్రధానకార్యదర్శి రాము, యువజన నాయకుడు అనిల్,అశోక్, సంగమేష్‌పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో చాకలి ఐలమ్మ విగ్రహానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 'భూమి మాది, పంట మాది మధ్యలో దొర ఏంది, దొర పెత్తనం ఏంది' అని పెత్తందారులను నిలదీసిన ఎర్రజెండ ముద్దుబిడ్డ చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. రజాకార్లను తరిమి కొట్టిన నిప్పు కణక అన్నారు. కష్టజీవుల హక్కుల కోసం, సమ సమాజ స్థాపన కోసం, బూర్జువా, పెట్టుబడదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలోపార్టీ నాయకులు జార్జ్, శ్రీనివాస్ రెడ్డి, జిలాని, రాములు, గఫార్ మూర్తి మహిళా సంఘం నాయకురాలు సునీత, లలిత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేటలో ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఆంధ్రమహాసభ సభ్యురాలుగా కొనసాగి గడీల పాలన నుంచి విముక్తి పొందాలని భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ : మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, అన్ని వర్గాల ప్రజలుపూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం దొరలను ఎదిరించి వారి వద్దనున్న సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచి పెట్టిన ఘనత ఐలమ్మది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చాకిరేవుదెబ్బ మండలాధ్యక్షులు నాగయ్య, పుల్కల్ మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, రాయపాడు మాజీఉపసర్పంచ్, సీనియర్ నాయకులు వెంకటేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండలంలోని హద్నూర్ గ్రామంలో సిద్దివినాయక రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, రజక సంఘం మండల అధ్యక్షులు మల్లికార్జున్, మాజీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు రజక సోదరులందరూ పాల్గొన్నారు.

వట్‌పల్లి : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం అధ్యక్షులు చాకలి కిష్టయ్య, నర్సింలు ఆధ్వర్యంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పూలమాలలతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకుర్తి దొరకు సంబంధించిన 90 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంపిణీ చేసిన ఘనత ఐలమ్మకే దక్కిందన్నారు. ఐలమ్మ త్యాగం, స్ఫూర్తి నేటి వాళ్లకి కనువిప్పు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి అలియాస్ కళ్యాణ్, వట్పల్లి డీలర్ పుష్పలత దిగంబర్ రావు, గంగారాం, రాందాస్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : నారాయణఖేడ్ సీఐటీయూ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ కన్వీనర్ రమేష్, కన్వీనర్ మైపాల్ మాట్లాడుతూ.. భూస్వాముల, దొరల, దేశ్‌ముఖ్‌ల, రజాకార్ల, పటేల్ పట్వారీల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

గుమ్మడిదల : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు మండల రజక సంఘం అధ్యక్షులు వీరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతాంగ పోరాటంలో ఆమె కీలక పాత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు మురళి, ఆయా గ్రామాల రజక సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



















డాక్టర్ల వివరాలు, ఛార్జీలతో పట్టిక ప్రదర్శించాలి

ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గాయత్రీ దేవి

పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో తనిఖీ.. ల్యాబ్‌లు సీజ్

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రవేట్ ఆసుపత్రుల్లో డాక్టర్ల వివరాలు, చార్జీలతో తప్పకుండా పట్టిక ప్రదర్శించాలని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గాయత్రీ దేవి సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగారెడ్డి బైపాస్‌రోడ్‌లోని శిశురక్ష హాస్పిటల్‌లో.. డాక్టర్ల వివరాలు, రోగుల వద్ద వసూలు చేస్తున్న ధరలకు సంబంధించిన పట్టికను రిసెప్షన్ వద్ద ప్రదర్శించలేదన్నారు. అలాగే ల్యాబ్లో రాపిడ్ కార్డ్ టెస్ట్‌లో డెంగ్యూ జ్వరం పాజిటివ్ వచ్చినా.. సెకండ్ శాంపిల్ ఎలిసాటెస్ట్ కోసం ఏదైనా పెద్ద డయాగ్నస్టిక్స్‌కు పంపించి అక్కడ ఎలిసా టెస్ట్‌లో పాజిటివ్ వస్తే.. అప్పుడు మాత్రమే డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ చేయాలన్నారు. కానీ ఈ ఆసుపత్రిలో రెండోసారి శాంపుల్ తీసుకని ఎలిసా టెస్ట్‌కు పంపించకుండానే డెంగ్యూ పాజిటివ్ అని నిర్ధారణ చేస్తూ రోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. దాంతో ల్యాబ్‌ను సీజ్ చేశారు. అలాగే సంగారెడ్డి చౌరస్తాలో గల చరిత ఆసుపత్రిని సందర్శించగా.. ఆసుపత్రిలో అపరిశుభ్రత, బయోమెడికల్ వేస్ట్‌మేనేజ్మెంట్ సరిగా మెయింటైన్ చేయకపోవడం, ఆసుపత్రిలో సరియైన ఫైర్ సేఫ్టీ సిస్టం లేకపోవడం, ల్యాబ్ లో రికార్డ్స్ సరిగా మెయింటెన్ చేయకపోవడంతో ఆ ల్యాబ్‌ను సీజ్ చేసి.. వారికి నోటీసు ఇచ్చారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, ల్యాబ్ నిర్వాహకులు తమ సంస్థల్లో పేషెంట్లకు ఇస్తున్న సర్వీసులు, వాటి చార్జీలు తప్పకుండా రిసెప్షన్లో ప్రదర్శించాలన్నారు. లేనియెడల ఆ ప్రయివేటు వైద్య సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులైన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

అర్హులైన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని, సదారం క్యాంప్ కు స్లాట్‌బుక్ చేసుకున్న వాళ్లకు మెసేజ్‌లు పంపాలని వికలాంగులకు ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్పిఆర్డి జిల్లా గౌరవ అధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. మంగళవారం సదారం క్యాంప్‌నకు వచ్చిన వికలాంగులను ఎవరూ సరిగా పట్టించుకోలేదన్నారు. దాంతో వికలాంగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగినారన్నారు. సదారం క్యాంపు కోసం సీరియల్ నంబర్ 150లోపు ఉన్నవాళ్లకు మెసేజ్ రాలేదు కానీ 300 ఉన్నవాళ్ళకు వచ్చిందన్నారు. మెసేజ్‌లు రాకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతూ తిరిగి వెళ్ళిపోయారన్నారు. అర్హులైన వాళ్ళకు సైతం పెన్షన్ రాక అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6000కు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చిందని ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. వికలాంగుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్డిఏ ఆఫీసులో ఏపీఎం కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పిఆర్డి జిల్లా ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు జరపాలి

నవతెలంగాణ-ఝరాసంగం

శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు సూచించారు. మండల పరిధిలోని ఎల్గోయిలో నాగులకట్ట గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వినాయ కునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సాహ కమి టీ సభ్యులు శాలువాతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర స్వామి, మాజీ ఎంపీటీసీ సంగీత గుండప్ప, జిల్లా యువ నాయకులు ఉదయ్‌శంకర్‌పాటిల్, బస్వరాజ్, నాగేష్ పాటిల్, సాబేర్, ఉత్సవ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రైతులను నిరాశ్రయులు చేసే పరిశ్రమలెందుకు?

నవతెలంగాణ-జహీరాబాద్



స్థానిక రైతులకు నిరాశ్రయులను చేసి.. యువతకు ఉపాధి కూడా కల్పించని పరిశ్రమలు తమకెందుకని.. ఈ ప్రాంతంలో అలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయొద్దని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై నరోత్తం అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజక వర్గంలో ఇప్పటివరకు ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించింది లేదన్నారు. నాడు మహీంద్రా కర్మాగారం 325 ఎకరాల్లో ఏర్పాటు చేసి.. 5000ల ఉద్యోగాలు ఇస్తా అని చెప్పినా ఆ చర్యలు తీసుకోలేదన్నారు. స్థానికేతరులకు ప్రాధాన్యత ఇచ్చి వారినే పర్మినెంట్ చేస్తున్నారని.. స్థానికులకు కాంట్రాక్టు పద్దతిలో కూలీలుగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. మిలటరీ బుల్లెట్‌ల కర్మాగారం నిర్మిస్తామని ఏపీఐఐసీ, టీఎస్ ఐడీసీ ద్వారా భూమిని సేకరించి పశువధ కర్మాగారం నిర్మించారని మండిపడ్డారు. అందులోను స్థానికులకు ఉద్యోగాలు లేవన్నారు. ఎక్కడో అటవీ ప్రాంతంలో పెట్టాల్సిన ఫార్మా కంపెనీని కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామంలో హైవే పక్కన స్థాపించి ప్రజలకు తాగునీరు లేకుండా చేసిన ఘనత ప్రభుత్వాలదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూచనెల్లి గ్రామ శివారులో ఆటోమొబైల్ పార్క్ అని రూ.3.5లక్షల ధరతో 314 ఎకరాలు గత 15ఏండ్ల క్రితం రైతుల దగ్గర నుంచి భూమిని అతి చౌకగా కొనుగోలు చేసి.. దాన్ని మార్చి ఆయిల్ కర్మాగారాలు అని చెప్పి కాలుష్యం వేదజేల్లే కర్మాగారాలకు ఏర్పాటు చేశారన్నారు. అక్కడ కూడా ఒక్క పరిశ్రమ లేదు.. ఒక్క ఉద్యోగం లేదన్నారు. నిమ్జ్ అని చెపుతూ లక్షల్లో ఉద్యోగాలని చెప్పి ఝరాసంఘం, న్యాల్‌కల్ మండలాల్లోని 17 గ్రామాలు 12625 ఎకరాల భూమిని తీసుకోవడానికి పూనుకున్నారన్నారు. ఇది గత 10 ఏండ్ల కిందటి మాట కానీ ఇప్పటి వరకు భూములు తీసుకోవడమే కానీ పరిశ్రమలు వచ్చింది లేదు.. ఉద్యోగాలు కల్పించింది లేదన్నారు. తాజాగా ఫార్మా సిటీ పేరిట డప్పుర్, మల్గి, వడ్డీ, గ్రామాల్లో పరిశ్రమలు స్థాపిస్తామని సుమారు 2004 ఎకరాలు రైతుల నుండి తీసుకుంటామని ప్రక్రియ ప్రారంభించారన్నారు. దాన్ని 3 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎక్కడో జన సంచారం లేని చోట పెట్టె ఈ ఫార్మా, కాలుష్యం వేదజేల్లే పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తామనడం సరికాదన్నారు. కాగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 3245 ఎకరాల్లో రూ.2361కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని జహీరాబాద్ లో స్థాపిస్తామని ప్రకటించడం జరిగిందని.. స్థానికులకు అక్కరకు రాని ఇండస్ట్రీ లైజేషన్ ఎందుకు ? అని నరోత్తం ప్రశ్నించారు. ఇప్పటి వరకు స్థాపించిన ఏ పరిశ్రమలో కూడా స్థానికులకు ప్రాధాన్యం లేదని.. ముందుగా ఇక్కడ ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.ఒకవేళ నిజంగా పారిశ్రామిక అభివృద్దే చేయాలనుకుంటే రైతుల వద్ద తీసుకొన్న భూమికి భూమినైనా ఇవ్వాలి లేదా మార్కెట్ ధర చెల్లించాలన్నారు. స్థాపించబడే పరిశ్రమలో ఆ భూముల రైతులకు బాగస్వామ్యం కల్పించాలని.. స్థానిక యువతకు 100శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. పరిశ్రమలకు అవసరమగు నైపుణ్య కోర్సులు ఇంజనీరింగ్, ఐటిఐ,స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలు ప్రారంభించి స్థానిక యువతకు శిక్షణ ఇప్పించి వారందరికీ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇక్కడ పరిశ్రమల స్థాపన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు శంకర్,రాజు,నర్సింలు,రాములు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

1020 ఎకరాల్లో పంట నష్టం

నవతెలంగాణ-న్యాల్‌కల్



వారం రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా 1020 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు తాత్కాలిక అంచనా వేసినట్టు ఏవో అవినాష్ వర్మ తెలిపారు. ఏఈవోలు క్లస్టర్ల వారిగా పంట పొలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి.. పంట వివరాలను అంచనా వేసినట్టు చెప్పారు. సేకరించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

నిమజ్జనం కోసం మల్కా చెరువును పరిశీలించిన ఎస్ఐ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని మల్కా చెరువును నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకులను నిమజ్జనం చేయడానికి అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. వినాయకులను ప్రతి ఏటా మల్కా చెరువులోనే నిమజ్జనం చేస్తారని అదేవిధంగా ఈసారి కూడా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలన్నారు. చెరువు నిండి నిండుకుండల్లా ఉన్నదని చిన్నపిల్లలు చెరువు గట్టు వద్దకు రావద్దన్నారు. ఎవరైనా యువకులు మద్యాన్ని సేవించి చెరువుగట్టు వద్దకు రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింలు, కానిస్టేబుల్ రజాక్, బండారి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనం కూల్చివేత

- మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలోని అల్లాపూర్ 7వ వార్డులో శిథిలావస్థలో ఉన్న పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం జేసీబీతో కూల్చివేశారు. వర్షాలు పడ్డప్పుడు చుట్టుప్రక్కల ప్రజలకు ఎలాంటి హాని , ప్రమాదం జరగకుండా మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, అల్లాపూర్ వార్డు కౌన్సిలర్ జిన్న భగవాన్ రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనంతరం గ్రామంలోని అన్ని వీధులలో కలియ తిరిగి సమస్య ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సంతోష్

నవతెలంగాణ-నర్సాపూర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సంతోష్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఓ జగదీష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే విద్య రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నర్సాపూర్ ప్రాంతంలోని వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్, రమేష్, ప్రవీణ్, కిరణ్, విద్యార్థులు ఉన్నారు.

ఉస్మానియా దూరవిద్య పోస్టు గ్రాడ్యుయేషన్ అడ్మిషన్లు ప్రారంభం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్

నవతెలంగాణ-మెదక్ టౌన్

ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క దూరవిద్య విభాగం అయిన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో దూరవిద్యా విధానంలో అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేసారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్‌లో ఉన్న ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అధ్యయన కేంద్రం ద్వారా, వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరుటకు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తారీకు లోపు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అన్నారు. అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత, విద్యార్థులు తమ ఒరిజినల్ ట్రాన్స్ ఫర్ సర్టిఫికేట్ (టిసి)తో పాటు ఇతర అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను స్టడీ సెంటర్‌లో అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం అక్కడ సర్టిఫికెట్ల పరిశీలన తరువాత అడ్మిషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఎమ్మెస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్), ఎం.ఎ (అన్ని సబ్జెక్టులు), ఎం.కామ్ వివిధ రకాల సర్టిఫికేట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మెదక్ పరిసర ప్రాంతాల్లోని డిగ్రీ పాసైన విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. అడ్మిషన్ వివరాల కోసం ఆసక్తిగల విద్యార్థులు 7382929698 నెంబర్‌కి కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

చేగుంట పీఏసీఎస్ ఎన్నికలు

- ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మెన్ బొనగిరి బాగులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎన్నికలు మంగళవారం ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ వి. శ్రేయ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న పీఏసీఎస్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో డైరెక్టర్ బోనగిరి బాగులు చైర్మెన్ పదవికి నామినేషన్ వేయగా మిగతా డైరెక్టర్లు అతనికి మద్దతుగా నిలిచారు. బోనగిరి బాగులు ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిచారు. ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ శ్రేయ గెలుపొందిన పత్రాన్ని సొసైటీ చైర్మెన్ బాగులుకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ సొసైటీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, అక్రమాలు జరగకుండా, రైతులకు సేవ చేసుకుంటానని, తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టిన ప్రతి ఒక్క డైరెక్టర్లకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో సందీప్, సిబ్బంది విష్ణు, లక్ష్మణ్, డైరెక్టర్లు రఘురాములు, సిద్ధ రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మండపాల నిర్వహకులతో పీస్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులతో స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు కరెంటు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరెంటు షాక్‌ల వలన అక్కడక్కడ చనిపోవడం జరుగుతుందని, గణేష్ మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసే సమయంలో రాత్రిపూట జాగ్రత్తగా నిమజ్జనం చేయాలన్నారు. చిన్న పిల్లలను చెరువు గట్టుల పైకి రానీయకూడదు అన్నారు. 17 తేదీన మిలాద్- ఉన్- అభి ముస్లింల పండుగ ఉన్నందున ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, సునీత , ఆమని ,రజాక్, విజయ్, ప్రవీణ్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రం హనుమాన్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ జోన్ చైర్మెన్ అయిత పరంజ్యోతి, వనిత క్లబ్ చైర్మెన్ సంధ్యారాణిలు మంగళవారం వినాయకుని పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సమేతంగా అన్నదా న కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైనారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి రఘు రాములు, అయిత రామ లింగం, దివాకర్, సుధాకర్,బంటి, కుటుంబ సభ్యులు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని వెంకయ్య తాండాకు చెందిన బానోత్ కుమార్ అకస్మాత్తుగా మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న తాజా మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5 వేల, నెలకు సరిపడు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆంజనేయులు, విట్టల్, రాజు, కిష్ట తండావాసులు ఉన్నారు.

అన్యాయాన్ని నిలదీసిన సివంగి చాకలి ఐలమ్మ

- ఐలమ్మ ఆశయాలను పార్టీ భుజాలపై మోస్తాం
- చాకలి ఐలమ్మ ఆశయ స్ఫూర్తితో పని చేస్తాం
- సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-మెదక్ టౌన్

చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో వెల్ కమ్ బోర్డు దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహానికి సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించి, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడుతూ చాకలి ఐలమ్మ అనాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ముఖ్య నాయకత్వం వహించారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ పోరాడన్నారు. రజక వృత్తి చేస్తూనే ఆనాటి దొరలకు వ్యతి రేకంగా పోరాడారని అన్నారు. కానీ అనాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఏమాత్రం సంబంధం లేని పాలక పార్టీలు ఐలమ్మ సేవలను మతానికి, కులానికి మాత్రమే చెందిందని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐలమ్మ కులానికి చెందినవారు కాదు ఆమె పేదల పక్షాన నిరంతరం పోరాటం చేసిన వీరవనిత అని కొనియాడారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర నాయకులు పై ళ్ళ ఆశయ్య మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ తెలంగాణలో భూస్వాములు, పటేల్, పట్వారీలకు ధీటుగా నిలబడింది. ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని వినిపించింది. దుర్భర బతుకులకు చరమగీతం పాడేందుకు నడుంబిగించిందన్నారు. దొరలను గడీల నుంచి ఉరికించిన వీరవనిత తెలంగాన పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా ఆమె పోరాట పటిమను గుర్తు చేసుకుందామన్నారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత అయిలమ్మతో పాటు ఆమె కుటుంబం ఊపిరి పీల్చుకుంది. చివరి వరకు స్ఫూర్తిదాయక జీవితం గడిపిన ఐలమ్మ తన 90 ఏండ్ల వయసులో 1986లో సెప్టెంబర్ 10వ తేదీన మరణించారు. అంతిమ యాత్రలో కమ్యూనిస్టు పార్టీల అగ్రనాయకత్వం, వివిధ రాజకీయ పార్టీల పాల్గొన్నారు. కామ్రేడ్ ఏ.సి.రెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షతన పాలకుర్తిలో ఐలమ్మ సంస్మరణ సభ జరిగింది. అనేక గ్రామాల నుంచి వేలాదిగా పాల్గొన్న ఈ సభలో కామ్రేడ్. భీమిరెడ్డి నరసింహారెడ్డి, నీర్మాల కృష్ణమూర్తి, మోటూరు ఉదయం వంటి వారే ఐలమ్మ పోరాట పటిమను కొనియాడుతూ నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ పోరాట యోధురాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు భూములు పంచాలని, ఇల్లు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె నర్సమ్మ, కె మల్లేశం, బస్వరాజు, జిల్లా కమిటి సభ్యులు సంతోష్, ప్రజా సంఘాల నాయకులు అజయ్, లచ్చయ, నాగమణి, దాసు, ప్రవీణ్, బాల్ నర్సయ్య, సక్కుబాయి, రామవ్వ రెడ్డి, నారాయణ, సత్యం పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణం దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - హవేలి ఘనపూర్

స్వచ్ఛమైన నీరు ఆరోగ్యకరమైన వాతావరణం దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తాయి అని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సహకారంతో మహిళా అభివృద్ధి సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నీరు పారిశుద్యం, పరిశుభ్రతపై డీఆర్‌డీఓ, మెప్మా మహిళా సంఘాలకు , ఏపిఎం, డిపిఎంలకు అవగాహన కార్యక్రమం ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీరు పారిశుద్యం, పరిశుభ్రత,వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రత పై ప్రజలను చైతన్యం చేయడంలో డిఆర్డిఏ ,మెప్మా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పారిశుద్యం,పచ్చదనం ఆరోగ్యం సమపాళ్లలో అందినప్పుడే ఆరోగ్యం అంతమైన సమాజం ఏర్పడుతుందని. పౌరులు త్రాగడానికి స్వచ్ఛమైన నీరు ఉండేలా వారి పరిశుభ్రత కు చైతన్య వంతులు కావాలని వివరించారు. సురక్షితమైన తాగునీరు పారిశుద్యానికి ప్రధాన అవరోధాలు ఆర్థిక వనరులు ఈ అవరోధాలను ఎదుర్కోవడానికి పరిష్కరించడానికి నీరు పారిశుధ్య రుణాలను అందజేయడం ఇంటి యొక్క నీటి వసతులు మరుగుదొడ్డి సమస్యలు పరిష్కారం కోసం ఆర్థిక వనరులు సమకూర్చడానికి నిపుణుల సేవలు అందించడానికి చిన్న సరళమైన రుణాలు సులభంగా తిరిగి చెల్లించేలా చేయడం పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళా అభివృద్ధి సొసైటీ హైదరాబాద్ బ్రహ్మవారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిర, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ నవీన్, ఏపీడి సరస్వతి, భూగర్భ జల శాఖ అధికారి ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ యాప్స్‌తో వ్యవసాయ రంగం విప్లవం సంతరించుకుంటుంది

- జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు



నవతెలంగాణ-హవేలిఘనపూర్: డిజిటల్ యాప్స్‌తో వ్యవసాయ రంగంలో విప్లవం సంతరించుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ యాప్, డిజిటల్ లైబ్రరీ ,డిజిటల్ వ్యవసాయ కోర్సులను క్యాబి బయో ప్రొటెక్షన్ పోర్టల్, ప్లాంట్ వైస్ ప్లస్నాలెడ్జ్ బ్యాంక్, క్రాప్ స్ప్రేయర్ వంటి యాప్‌లు సంబంధించిన పోస్టర్లను జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో తక్కువ సమయంలో తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడిన సాధిస్తూ ఎక్కువ ఆదాయం పొందుతూ రైతు యొక్క ఆర్థిక పరిస్థితు లను మెరుగు పరుచుకోవాలన్నారు.అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి యాప్ లు వ్యవసాయ రంగంలోని అధునాతన సాంకేతిక పరిజ్ఞానా న్ని ఉపయోగించుకున్నట్లయితే వ్యవసాయ రంగంలో ఎంతో అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా డిజిటల్ యాప్స్ ను డౌన్లోడ్ చేసుకొని వాడుకున్నటయితే రోజువారి వ్యవసాయ కార్యక్రమాలలో నూతన వ్యవసాయ పరిజ్ఞానంతో చీడపీడలను అరికట్టవచ్చు అని అన్నారు. ఈ డిజిటల్ యాప్స్ వాడడం వల్ల రైతుల యొక్క సమయం ఆదావుతుందని తన పొలం నుండే తన పొలంలో పంటలలో సోకేటువంటి చీడపీడల గూర్చి పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ డిజిటల్ యాప్స్ అన్ని వ్యవసాయ విస్తరణ విభాగంలో పనిచేసే అధికారులకు యువ రైతులకు విద్యావంతులైన రైతులకు ఎంతో ఉప యుక్తంగా ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్ నారాయణ సోమలింగారెడ్డి హర్ష తో పాటుగా దేశీ కోఆర్డినేటర్ అమరేష్ కుమార్, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధు మంజరి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపంలో మాజీ సర్పంచ్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలోని గణనాథుడు ప్రజల సర్వ విఘ్నాలను తొలగించి సర్వశుభాలను ప్రసాదిం చాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ స్వర్ణలత, భాగ్యరాజ్ దంపతులు వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని సోమవారం రాత్రి టాటా కాపీ వెంచర్‌లో తూప్రాన్ మున్సిపల్ పరిధిలో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూప్రాన్ మున్సిపల్, మండల ప్రజలు, చందాయిపేట గ్రామ ప్రజలందరూ ఆయురా రోగ్యాలు, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని వినాయ కుడిని ప్రార్థించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోరి కలు తీర్చే గణపతి, విఘ్నాధిపతి అయిన లంబోదరుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయు రారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిం చారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రకృతి వైపరీత్యాలు తొలిగి ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో విగ్రహ కమిటీ నిర్వాహకులు, బుడ్డ భాగ్యరాజ్, దశరథ్, గడ్డమీది రాజుయాదవ్, మహేందర్, మల్లేష్ యాదవ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- బైకును ఢీ కొట్టిన ట్యాంకర్ లారీ
- ఇద్దరు మృతి



నవతెలంగాణ-చేగుంట

చేగుంట ఉమ్మడి మండలం రామంతపూర్ 44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం, ఈ ప్రమాదంలో లారీ క్రింద పడి తండ్రి, కొడుకులు మృతి చెందారు. ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన దొంతి మల్లేశం(37), దొంతి బూదయ్య (65), వీరు నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ లో చూపించుకోవడానికి బైక్ పై వెళ్తున్నారు. రామంతపూర్ గ్రామ శివారులోని ఎన్‌హెచ్ 44 రోడ్డు న్యూ శాంత వెంచర్ ముందు కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ట్యాంకర్ లారీ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఇద్దరు వ్యక్తులపై నుంచి ట్యాంకర్ లారీ వెళ్లడంతో బైకు నడుపుతున్న మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు, బూదయ్యను చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చనిపోయాడు. ఈ హృదయ విధారకమైన ప్రమాద ఘటన చూపరులను కంటతడి పెట్టించింది. మల్లేశం భార్య మౌనిక ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

పెద్ద శంకరంపేట పట్టణంలోని తిరుమలాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పీటలు ఏర్పాటు చేసుకొని పసుపు కుంకుమలతో సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన చకిలం విశాల, మాజీ వైస్ ఎంపీపీ కన్నయ్య గారి లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

- భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీర వనిత
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ - హవేలీ ఘనాపూర్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సామాజిక ఆధునిక పరిమాణానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి చిట్యాల ఐలమ్మ అని కలెక్టర్ రాహుల్ రాజ్ కొని యాడారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతిని, జయంతి వేడుకలను కూడా అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొంగు నడుముకు చుట్టి, కొడవలి చేపట్టి నైజాం సర్కార్‌తో పాటు విస్నూర్ దొరల ఆగడాలను ఎదిరించిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. ఆనాడు నిరంకుశ రజాకార్లను దేష్ముఖ్‌లకు వ్యతిరేఖంగా మొక్కవోని ధైర్యం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ వీరవనిత ధైర్యశాలిగా పేరు గాంచిందన్నారు. భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టిచాకిరీ విముక్తి కొరకు జరిగిన సాయుధ పోరాటంలో దొరలు, రజాకార్ల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో మిల్లర్లు అలసత్వం వీడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

జిల్లాలోని సీఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో మిల్లర్లు అలసత్వం వీడాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మిల్లర్ల యజమానులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని సీఎంఆర్ బియ్యం డెలివరీ ఆలస్యం చేస్తున్న మిల్లర్లతో జిల్లా అదనపు కలెక్టర్ మెదక్ వెంకటేశ్వర్లు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ బియ్యం డెలివరీలో ఆలస్యం చేస్తున్న మిల్లర్లకు డెలివరీ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని మిల్లులకు వానాకాలం ధాన్యం 2,68,777 టన్నులు కేటాయించటం జరిగింది అని, ఇందుకు గాను మిల్లరూ అందజేయాల్సిన 1,80,741 టన్నుల బియ్యంకు గాను ఇప్పటివరకు 1,46,858 టన్నుల బియ్యం, 81.30శాతం పూర్తి అయ్యిందని, ఇంకనూ పూర్తి చేయాల్సిన 33,883 టన్నులను ఈ నెల ఆఖరు వరకు మాత్రమే గడువు ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. యాసంగి సీజన్ 2023-24 కి గాను 2,52,013 టన్నుల ధాన్యం కేటాయించటం జరిగింది అని, ఇందుకు గాను 1,70,777 టన్నుల బియ్యం రావాల్సి ఉందని, ఇందుకు గాను 54961 టన్నుల బియ్యం డెలివేరి చేశారని, 32.18శాతం మాత్రమే పూర్తి అయ్యిందని మిగితా బియ్యం 1,15,816 టన్నులు గడువు లో రికవరీ చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా పౌర సరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, జిల్లా మేనేజర్ హరి కృష్ణ, జిల్లా రా మిల్లర్స్ అధ్యక్షులు వీరేశం, మిల్లర్లు,సంబంధిత శాఖ అధికారులు, పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు హామీని నెరవేర్చాలి

- మెదక్ జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మెదక్ జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 ద్వారా అన్యాయానికి గురైన బాధితులకు వెంటనే న్యాయం చేయాలని, కేజీబీవీ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న డీఏలను బిల్లులను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు సునార్ రమేష్. పెద్ద శంకరంపేట అల్లాదుర్గం మండల అధ్యక్షులు రవి, గురు చరణ్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు

ఇంటి పర్మిషన్ కోసం మూడు నెలల నుంచి నిర్లక్ష్యం



నవతెలంగాణ-కౌడిపల్లి

ఇంటి పర్మిషన్ కోసం గత మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శి సుజాత నిర్లక్ష్యం చేస్తుందని మాజీ ఎంపీటీసీ శంకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిమ్మాపూర్ గ్రామంలో సర్వేనెంబర్ 270 లో ఇల్లు నిర్మించుకునేందుకు ఇంటి పర్మిషన్ కోసం పంచాయతీ సెక్రెటరీ సుజాతకు గత మూడు నెలల క్రితమే మీ సేవ ద్వారా దరఖాస్తు పెట్టానని ఆయన తెలిపారు. ఇప్పుడు మళ్లీ దరఖాస్తు పెట్టుకోమని అంటుందని ఆయన అన్నారు. తన పట్ట భూమిలో నాలా మార్పిడి చేసి మరి దరఖాస్తు పెట్టానని తెలిపారు. మూడు నెలలుగా అనుమతి ఇవ్వకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం లో ఉన్న పంచాయతీ సెక్రెటరీ సుజాతపై శంకర్ వాగ్వాదానికి దిగారు. గత మూడు నెలలుగా ఎందుకు ఇంటి పర్మిషన్ ఇవ్వడం లేదని ఆమెను ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సారా రామా గౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. విధుల్లో ఇంత నిర్లక్ష్యం ఎందుకని పంచాయతీ సెక్రటరీ సుజాత పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చల్మెడ గ్రామాన్ని సందర్శించిన డీఎల్‌పీఓ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామాన్ని మెదక్ డిఎల్‌పిఓ సురేష్ బాబు సందర్శించడం జరిగింది. గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెగ్రిగేషన్ షెడ్డు ,పల్లె ప్రకృతి వనం, స్మశాన వాటిక ,నర్సరీ, ట్యాంక్ బండ్ ప్లాంటేషన్ కమ్యూనిటీ ప్లాంటేషన్, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామంలోని పలు వీధులు మురుగు కాలువలు పరిశీలించడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట నిద్రపోయే ముందు దోమతెరలను వాడాలన్నారు. ఇంటి చుట్టుముట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట నరసింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి, ఆశా వర్కర్లు, పరిశుద్ధ కార్మికులు గ్రామస్తులుపాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ స్వాతంత్ర్య పోరాటంలో దొరలను ఎదిరించిన ధైర్యవంతురాలని, పోరాట స్ఫూర్తిని, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమకారునిగా చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు,పెద్దలు, తెలంగాణ ఉద్యమ నాయకులు మన్నె శ్రీనివాస్ రావు, మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చిన్న లింగ మల్లికార్జున్ గౌడ్, బీజేపీ తూప్రాన్ మున్సిపల్ శాఖ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ 15వ వార్డు అధ్యక్షులు బాయికాడ ఆంజనేయులు, బీజేపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ రజాకారులను ఎదిరించిన సాకలి ఐలమ్మ ధైర్యశాలి అన్నారు. వీరనారి ఐలమ్మ వర్ధంతి నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రజక జాతిలో కూడా మహిళలు సాకలి ఐలమ్మను చూసి నేర్చుకోవాలన్నారు.ప్రభుత్వం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోరజక సంఘం మండల అధ్యక్షులు దుబ్బరాజయ్య, పట్టణ అధ్యక్షులు మామిడాల లింగం, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని జప్తి శివనూర్ గ్రామం కాశ్య తాండా కు చెందిన ఎండి షాబుద్దీన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందూ మృతుని కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని ఆర్థిక పరిస్థితి తెలుసుకుని కుటుంబానికి తన వంతు సహాయం చేసానని, భవిష్యత్తులో భాదిత కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామి నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ల అధ్యక్షుల ఫోరం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు నుంచి ముస్త్యాల వెళ్లే దారిలో చిన్నవాగు పై ఉన్న కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేయించాలని. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండేళ్ల క్రితం భారీ వర్షాలతో ప్రమాదకరంగా మారిన కల్వర్టు ను సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలేటి యాదగిరి, మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం భారీ వర్షాలతో కల్వర్టు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని. వాహనాదారులు వందలాదిమంది కల్వర్టుపై పడి కాళ్ళ చేతులు విరిగాయని దీనిపై నుంచి రోజు వాహనాలు రాకపోకలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు కల్వర్టు మీద నుంచి మండల అధికారులు వెళ్తున్నప్పటికీ ప్రమాదకరంగా మారిన కల్వర్టును చూసి కూడా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల నుంచి వాహనదారు లను ప్రజలను కాపాడాలని. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండి షఫీ, ఆల్ల రమేష్, నాయకులు పిట్టల నరేశ్, ఇట్టమైనా పరమేశ్, పిడీషెట్టి రాజు, వెల్పుల విజయ్ పాల్గొన్నారు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దాం

- స్టీల్ బ్యాంక్‌లను సద్వినియోగం చేసుకోండి
- మునిసిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దాం, స్టీల్ బ్యాంక్ లను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సూచించారు. పురపాలక సంఘం కార్యాలయంలో హెూటల్, ఫంక్షన్ హాల్ యజమానులతో, నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్‌ల వాడకం లేకుండా, హెూటల్‌లలో టిఫిన్స్ వాడకానికి స్టీల్ ప్లేట్స్, గ్లాస్‌లను వాడాలని, వేడి వేడి ఆహార పదార్థాలను వడ్డించినప్పుడు ప్లేట్ లోకి ప్లాస్టిక్ ఆహార పదార్థాల్లో కరిగిపోయి క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడే అవకాశం ఉందనీ, ప్లాస్టిక్‌ని నిషేదిద్దామన్నరు. శుభకార్యాల కోసం ఫంక్షన్ హాల్ వారికి ముందస్తుగా బుకింగ్ జరుగుతుంది కాబట్టి, ప్లాస్టిక్ నిషేధిస్తూ స్టీల్ బ్యాంక్ ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లు, హెూటల్, ఫంక్షన్ హాల్‌ల యజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు





నవతెలంగాణ-సిద్దిపేట

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ రాష్ట్ర చైర్మెన్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ నాయకులు కలీముద్దీన్ అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, అతనితో కాంగ్రెస్ విద్యార్థి విభాగం నుంచి ఇప్పటి వరకు కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ముగిసిన ఐసెట్ ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-నంగునూరు

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్‌లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.గోవర్ధన్ తెలిపారు. కౌన్సెలింగ్ కు 39 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 969 రిజిస్టర్ చేసుకోగా 837 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిస్టమ్ ఆపరేటర్ అభినవ్, అధ్యాపకులు వై.రాజు, షాహెబాజ్, విజయ్ కుమార్, రాజమౌళి, కవిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటిగల్ మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన కొమ్మురాజుల రమేష్, మొక్కజొన్న పంటను సిద్దిపేట జిల్లా తోర్నాల ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు సిహెచ్ పల్లవి, జక్కుల విజయ్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమ్మురాజుల రమేష్, వేసిన మొక్కజొన్న పంట బాగుందని 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తదని వారు తెలిపారు. కంకి పొడవుగా ఉందని గింజ మంచిగానే ఉందని వారు తెలిపారు. తల చుంచు సమయంలో బెట్ట కు గురి కావడంతో రెండు మూడు కాయలు వచ్చాయని తెలిపారు. వారి వెంట వ్యవసాయ అధికారి ఎండి అఫ్రోజ్ , ఏఈఓ అనూష, రాధికలు ఉన్నారు.

సెక్రెటరీ అధ్యక్షుడిగా లింగంపల్లి మురళి ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా పంచాయతీ సెక్రెటరీ జిల్లా అధ్యక్షుడిగా లింగంపల్లి మురళి, కార్యదర్శిగా విద్యా వికాస్ రెడ్డి ఎన్నికైనట్లు టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రాష్ట్ర కన్వీనర్ బలరాం, ఎలక్షన్ ఆఫీసర్ నిమ్మ సురేందర్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోహన్, కోశాధికారిగా వంశీకృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, గజ్వేల్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు లింగం, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



నవతెలంగాణ-మర్కుక్

ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ అధ్యక్షులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్‌లో విధులు నిర్వహిస్తున్న రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మండల ప్రాథమికోన్నత పాఠశాల శివారు వెంకటపూర్‌లో విధులు నిర్వహిస్తున్న తుమ్మ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా పి. శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా ఎస్. సంధ్యారాణి ,కార్యదర్శులు సి.మధు, కార్యదర్శిగా భూజాత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.కృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తమ పై నమ్మకముంచి ఎన్నుకునందుకు పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయ పీఆర్టీయూ సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్య పై తమ వంతు కృషిచేస్తామని హామీ నిచ్చారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించి జిల్లా పరిశీలకులు



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి జిల్లా పరిశీలకులు సెక్టోరల్ అధికారి రామస్వామి ,మర్కుక్ ఎంఈవో ఉదయ భాస్కర్‌తో కలసి మంగళవారం సందర్శించారు. వర్షాలు కురిసిన నప్పుడు పాఠశాల అవరణలో నీళ్ళు నిలిచి చెరువు తలపిస్తుంది. అవరణలో నీళ్ళు నిలవకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి తగు చర్యలు చేపడుతమన్నారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న 6వ, 9వ తరగతులు విద్యార్థులకు (నాస్) నెషనల్ అచ్యుమెంట్ సర్వే సంసిద్ధత పరీక్షను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ భాగ్యలక్ష్మీ , విద్యార్థులు, తదితరులున్నారు.

వీధి కుక్కల నియంత్రకు చర్యలు

- 5వ వార్డ్ కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

5వ వార్డులో కుక్కల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కుక్కల వాహనం తెప్పించి, కుక్కలను పట్టించడం జరిగిందనీ, ప్రజలకి ఏవిధంగా ఇబ్బంది లేకుండా చేయడం జరుగుతుందనీ 5వ వార్డ్ కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ తెలిపారు. మంగళవారం అయన మాట్లాడుతూ కుక్కలకు ఆపరేషన్ చేసి వాటి జనాభా నియంత్రించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాన్ హెూల్ చాలా నెలల నుంచి జాం అయ్యిదాని, ఎన్ని సార్లు క్లీన్ చేసిన సమస్య పోవడం లేదనీ, మున్సిపల్ సిబ్బందితో కొత్త పైప్ లైన్ వేసి, ప్రజలకి మురికి వాసన బాధ నుంచి విముక్తి చేయడం జరిగిందని తెలిపారు.

సాఫ్ట్ బాల్ జిల్లా సెలక్షన్స్

- రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ జూనియర్స్ లెవెల్ బాల బాలికలు ఎంపికలు నిర్వహించామని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నేతి కైలాసం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల క్రీడాకారులు 80 మంది పాల్గొన్నారనీ, ఇందులోనుంచి 16 మంది బాలికలు, 16 మంది బాలుర జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 21, 22, 23వ తేదీల్లో సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి బాల బాలికల పోటీల్లో జిల్లా తరపున వీరు ఆడుతారని అన్నారు. ప్రతి ఏటా జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణిస్తున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ పాఠశాల ఇంచార్జ్ మేరీ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఎస్సీ విద్యార్థులకు రేపు స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-చేర్యాల: సిద్దిపేట జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5 నుంచి తొమ్మిదో తరగతులలో మిగిలిపోయిన ఎస్సీ బాల బాలికల సీట్లకు రేపు(గురువారం) మిట్టపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి బి.అశోక్ బాబు తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం అశోక్ బాబు విలేకరులతో మాట్లాడుతూ అర్హతలు ప్రవేశాలకు నిర్వహించినటువంటి అర్హత పరీక్ష రాసి సీటు పొంది గురుకులంలో చేరని వారు, పరీక్ష రాసినటువంటి ఎస్సీ విద్యార్థులు, ఆర్ఫన్, సెమిఆర్ఫన్ విద్యార్థులు, ఎస్సీ దివ్యాంగులు వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉన్నవారు అర్హులని, అర్హత కలిగిన ఎస్సీ క్యాటగిరీకి చెందిన విద్యార్థులు గురువారం ఉదయం 10 గంటలకు హాల్ టికెట్, అర్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ప్రముఖులు









నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్‌ని ఆయన స్వగృహంలో రాష్ట్ర సెట్విన్ చైర్మెన్ యస్.గిరిధర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే పదవులు దక్కుతాయని చెప్పడానికి మహేష్‌కుమార్ గౌడ్ నియామకమే చక్కటి ఉదాహరణ అన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

అమీన్‌పూర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్‌కు పూలబొకే అందించి సన్మానించారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

ఐడీఏబొల్లారం: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, యువజన నాయకుడు వి.ప్రవీణ్‌రెడ్డి పార్టీ నాయకులతో మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీపీసీసీ అధ్యక్షులుగా నియమతులైన మహేష్ కుమార్ గౌడ్‌ను బొల్లారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుల్లగూర్ల జైపాల్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చెరువుల్లోకి నీళ్ళు వదలండి సారూ..

- దామరకుంట రైతుల వినతి
- పక్కన కొండపోశమ్మ ప్రాజెక్టు కాలువ
- ఆ గ్రామానికి చుక్క నీరు లేక వెల వెల



నవతెలంగాణ-మర్కుక్

మా ఊరు చెరువుల్లోకి నీళ్ళు వదలాండి సార్ అంటూ సిద్దిపేట జిల్లా ,మర్కుక్ మండల పరిదిలోని దామరకుంట గ్రామానికి చెందిన రైతులు నీటిపారుదల ఈఈ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కన కొండ పోశమ్మ ప్రాజెక్టు నుంచి గోదావరి కాలువ యాదాద్రి భువనగిరి జిల్లాకు నీరు ఉప్పెనేల గంగా నిత్యం ప్రవహిస్తు ఉంది. కానీ మర్కుక్ మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో బుల్చమ్మ కుంట, తిట్టోని చెరువు, మొగ్గుల చెరువుల్లోకి అదికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో చుక్క నీళ్ళు రాకుండ చేశారని అవేదన వ్యక్తం చేశారు. కొండపోచమ్మ ప్రాజెక్ట్ నుంచి దామరకుంట చెరువులకి కాలువ ద్వారా నీళ్ళు అందకపోవడం వల్ల బుల్చమ్మ కుంట చెరువుకి గెట్ వాల్ పెట్టారు కానీ రైతులకి దారి లేకుండా లేకపోవడంతో చెరువుకి వెళ్ళే కలువ మూసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. తిట్టోని చెరువుకి గెట్ వాల్ పెట్టకపోవడంతో నీళ్ళు రావడంలేదని వాపోయారు. మొగ్గుల్ల చెరువుకు కంటే కాలువ కిందకి ఉండడం వల్ల చెరువులోకి నీళ్ళు రావడంలేదన్నారు. దామరకుంట నుంచి కాశిరెడ్డి పల్లి వెళ్ళే దారిలో పెంజారాల గుండు దగ్గర ఉన్న కాలువ పైన కల్వర్టు నిర్మాణం చేయకపోవడం వలన రైతులకు రాకపోకలకి ఇబ్బందులకు గురైతున్నరన్నారు. ఇప్పటికైన సంబంధిత అదికారులు చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటల పరిశీలన





నవతెలంగాణ-రాయపోల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న, నీట మునిగిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని, వర్షాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించడం జరిగిందన్నారు. రామారం గ్రామంలో పత్తి పంటలను పరిశీలించటం జరిగింది. ఇప్పటి వరకు కురిసిన వరస వర్షాల వల్ల నీరు నిలవ వుండటం వలన పంటలు ఎరుపు బారటం, పూత రాలటం గమించటం జరిగింది. మండల పరిధిలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట వివరాలను నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. పంట చేనులో నీరు నిల్వ ఉండకుండా రైతులు చూసుకోవాలని, కాలువల ద్వారా నీటిని బయటకు పంపించాలని తెలిపారు. పంట నష్టం జరిగిన రైతులు సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రవీణ్, రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండలంలోని అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న రైతుల పంటలను తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు దత్తాత్రేయ నల్కర్ రవికుమార్ ప్రతాపరెడ్డిలతోపాటు వ్యవసాయ శాఖ అధికారి గోవిందరాజు విస్తరణ అధికారులు ప్రియాంక, శ్రీహరి, తదితరులు పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు ఎఫిడోపైరోఫిన్ మందును, మొక్క పెరుగుదలను నియంత్రించడానికి కణుపుల మధ్య దూరం తగ్గించడానికి మెపిక్వాట్ క్లోరైడ్ మందులు వేయాలని సూచించారు.పత్తి పొలంలో నీరు ఉంటే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకి మొక్కలు చనిపోయే అవకాశం ఉందని నీరు నిల్వ ఉండకుండా కాల్వలు చేసి బయటకు తీయాలన్నారు. పూత, కాయ రాలుట నివారించడానికి 10 గ్రాముల 13-0-45 మందును నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అంతేగాక కాయకుళ్ళు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయగలరని సూచించారు.

ఆర్యవైశ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీఠ



నవతెలంగాణ-గజ్వేల్

ఆర్యవైశ్యులకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. మంగళవారం గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద ఆర్యవైశ్య నాయకుడు గంగిశెట్టి పవన్ కుమారుడు వచన్ పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పులిహెూర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందని అందులో సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషిచేసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయినట్లు ఆయన చెప్పారు. వైశ్య కార్పొరేషన్ తో వైశ్యులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. గంగిశెట్టి వచన్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి మంగళవారం పులిహెూర పంపిణీ చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్, మహాసభ సేవాదళ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్యాల భద్రయ్య, ఆర్యవైశ్య యువ నాయకుడు సోముల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని గజ్వేల్ మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఆరు గ్యారంటీలు దశలవారీగా పూర్తి చేస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు రైతులు ఆకర్షితులై వచ్చే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కు, మంత్రి దామోదర్ రాజనర్సింహతో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

పోరాట ధీశాలి ఐలమ్మ..



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సాయిద పోరులో అగ్ని కణం వలె దొరలు, దేశ్‌ముఖ్‌లను తరిమి కొట్టిన పోరాట ధీశాలి చిట్యాల ఐలమ్మ అని నవతెలంగాణ మేనేజర్ రేవంత్ కుమార్ అన్నారు. మంగళవారం నవతెలంగాణ మెదక్ రీజీయన్ కార్యాలయంలో 39వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటా నికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఉమ్మడి జిల్లా స్టాఫర్ కృష్ణ, అకౌంటెంట్ రజిత, సబ్ ఎడిటర్ దస్తగిరి, ఏడీవీటీ ఇంచార్జి ప్రవీణ్, డిజైనర్ నివాస్, ఆపరేటర్ అంజమ్మ, క్లర్క్ మమత పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు

- సమయం కావాలంటున్న ఇంటి యజమానులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో 100 ఫీట్ల రోడ్డు పనుల్లో భాగంగా ఇండ్లను కూల్చారు. హుస్నాబాద్ పట్టణంలోని అర్‌టీసీ క్రాస్ రోడ్డు నుంచి హన్మకొండ రోడ్డులో కూల్చివేత పనులు వేగవంతం చేశారు. ఇండ్లను కూల్చవద్దని ఇంటి యజమానులు జెసిబికి అడ్డం వచ్చిన పోలీస్‌లు ఏలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. ఇంటి యజమానులకు రోడ్డుకు వచ్చే ఇండ్లను తొలగించాలని చెప్పిన తొలగించలేదని ,అందుకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇంటి యజమానులు ఎన్ని చెప్పిన కూల్చివేత పనులు నిలిపివేయలేదు. పనులను వేగవంతం చేసి రోడ్డు పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

అవకాశం ఇస్తే మేమే తొలగించుకుంటాం...

బతుకమ్మ, దసరా పండుగలు ఉన్న నేపథ్యంలో అవకాశం ఇస్తే స్వతహాగా మేమే సెట్ బ్యాక్ అవుతామని వ్యాపారస్తులు కోరుతున్నారు. కూల్చివేతల కారణంగా వ్యాపారం చేసుకునే మాకు ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

- -ప్రోగ్రెసివ్ పేరెంట్ లీగ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శంకర్



నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ పేరెంట్ లీగ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మెట్ల శంకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్పల్లిలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు రాష్ట్రానికి విద్యారంగంలో గొప్ప పేరు తెచ్చిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమస్యలతో సతమత మవుతున్నాయన్నారు. కనీస వసతుల కల్పనలో ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు శక్తికి మించి పనిచేస్తున్నారని దాని ఫలితమే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అన్నారు. సిద్దిపేట జిల్లాలోని గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థుల తల్లి దండ్రులు సైతం కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్తా, వైస్ ప్రిన్సి పల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, పిపి ఎల్ స్టేట్ కోఆర్డినేటర్ జనార్ధన్,జిల్లా కమిటీ సభ్యులు మహేశ్వ రం శ్రీనివాస్, మల్లేశం,రాజు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నమూనా పరీక్ష పరిశీలన



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నమూనా పరీక్షను కుకునూరుపల్లి మండల ఎంఎన్ఓ బి. సత్తయ్య మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి నమూనా పరీక్ష మంగళవారం అన్ని పాఠశాలలో మూడు, ఆరు ,తొమ్మిది తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆయన మండలంలోని తిప్పారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కుకునూరు పల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా అభివృద్ధి సామర్థ్యాల పరీక్షను ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఎన్సీఈఆర్టీ నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం నవంబర్ లో జరగనుంది. అందుకు ముందుగా నమూనా పరీక్షలు జరుగుతున్నాయి. తిప్పారం ప్రాథమిక పాఠశాలలో పరీక్ష పేపర్ మి విడుదల చేసే విద్యార్థులకు అందజేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి తరగతిలో మొదటి ద్వితీయ స్థానం పొందిన వారికి బహుమతులు అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

అర్హులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలి

- దుబ్బాకలో బల్వంతాపూర్ గ్రామస్తుల నిరసన



నవతెలంగాణ-దుబ్బాక

ఆర్థికంగా ఉన్నవారే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో గత రెండేళ్లుగా ఉంటున్నారని, వెంటనే వారిని ఖాళీ చేయించి నిరుపేదలైన అర్హులకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ బల్వంతాపూర్ గ్రామస్తులు మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 13 లోగా వారిని ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేటాయింపులో నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే తమ గ్రామంలో బహిరంగంగా గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల సమక్షంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని కోరారు. గ్రామస్తులు బీ.సత్తయ్య, పడిగే యాదయ్య,జంగిటి సత్యనారాయణ, పలువురు గ్రామస్తులు ఉన్నారు

కుల మత భేదాలు లేకుండా వినాయక నిమజ్జనం నిర్వహించాలి

- సిద్దిపేట రూరల్ సీఐ శీను



నవతెలంగాణ-నంగునూరు

కులమత బేధాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని సిద్దిపేట రూరల్ సీఐ శీను అన్నారు. మంగళవారం మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నిమజ్జన కార్యక్రమంలో డీజే వినియోగించవద్దని, అదే విధంగా మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. నంగునూరు మండలంలో యువత పెడదారి పడకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పేట ఎస్ఐ ఎం.డి. అసీఫ్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్స్ రాజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, గణేశ్ మండపాల ఆర్గనైజర్‌లు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర పాఠశాలలో న్యాయ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆదేశాల ప్రకారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహనా సదస్సును మంగళవానం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ హాజరై మాట్లాడుతూ.. పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలన్నారు. అందరూ క్రమశిక్షణగా ఉండాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాధికారిని కలిసిన మంజీర స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా క్రీడా అధికారిని మంజీర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో క్రీడలు, స్టేడియం గ్రౌండ్‌కి సంబంధించిన సమస్యల గురించి ఆయనకు సభ్యులు వివరించారు. ఈ సమావేశంలో మంజీర స్పోర్ట్స్ క్లబ్ తరపున అధ్యక్షులు మాణయ్య, సభ్యులు మాచ్చెందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఆవనణలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

- దుబ్బాక ఎస్ఐ వి. గంగరాజు



స్పందన

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మందుబాబులకు నిలయంగా రైతు వేదికలు అనే శీర్షికతో ఈనెల 9 న నవతెలంగాణ తెలుగు దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి దుబ్బాక పోలీసులు స్పందించి దుబ్బాక మండలం పరిధిలోని పెద్దగుండెవెళ్లి రైతు వేదికను సందర్శించారు. అనంతరం గ్రామస్తులను, జీపీ సిబ్బంది నుంచి వివరాలు ఆరా తీశారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మద్యం, సిగరెట్లు సేవించవద్దని దుబ్బాక ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు

జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకొని న్యాయవాదులతో సమావేశం



నవతెలంగాణ-గజ్వేల్

జాతీయ లోక్ అదాలత్ కార్యక్ర మాన్ని సెప్టెంబర్ 28 తేదీన గజ్వేల్ కోర్టు ఆవరణలో నిర్వహిం చనున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ మండల సేవాధికార సంస్థ చైర్మెన్ సౌమ్య పేర్కొన్నారు. న్యాయవాదులతో సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్తానం సుప్రీం కోర్టు పిలుపుమేరకు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసుల పరిష్కారం ద్వారా సత్వర సమన్యాయం కొరకు లోక్ అదాలత్ చక్కని వేదికని అభివర్ణించారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియో గం చేసుకోనేం దుకు న్యాయ వాదులు విభాగ ము సంబందిత అధికారులు కృషిచేసి ఎక్కువ మందికీ న్యాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాండరి, బార్ అసోసియేషన్ సభ్య న్యాయవాదులు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది, నర్సింహా చారి, యామిని, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- సీఐ శ్రీనివాస్



నవతెలంగాణ-దుబ్బాక

మహిళలను, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పాలెపు శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణ చట్టాల పట్ల సీఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం బాలికలు, మహిళల రక్షణ కోసం పలు నూతన చట్టాలను తీసుకొచ్చిందని వివరించారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న నిర్వహించిన 'దేశభక్తి పాటల' పోటీల్లో విజేతలైన విద్యార్థినీలకు సీఐ చేతల మీద ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వాతి, ఉపాధ్యాయినులు, పలువురున్నారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని స్థానిక టీఎన్జీవో భవన్‌లో గజ్వేల్ మండల ఎస్జీటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమము కి హాజరు అయిన ఎస్జీటీయు జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, వర్గల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్‌లో జరిగిన బదిలీల్లో స్థాన చలనం పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, ప్రతి పాఠశాలకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల నూతన అధ్యక్షులు గా రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, ఉపాధ్యక్షులుగా ఆనంద్ బాబు, సుధాకర్, పద్మ, కార్యదర్శులుగా రజిత, శ్వేత, ప్రవీణ్ చారీ ఎన్నికయ్యారు.

అర్బన్ మండల వర్కింగ్ జర్నలిస్టుల నూతన కమిటీ ఎన్నిక


- సిద్దిపేట అర్బన్ మండలం వర్కింగ్ జర్నలిస్టుల కమిటీ



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం వర్కింగ్ జర్నలిస్టుల సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుక న్నారు. అర్బన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జైపాల్ రెడ్డి, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా బి. శ్రీనివాస్, ఆఫీస్ ఇన్చార్జిగా శ్రీకాంత్‌లను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అర్బన్ మండల వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని అర్బన్ మండల జర్నలిస్టులకు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షున్ని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బొమ్మగోని మహేష్ గౌడ్‌ను మంగళవారం హైదరా బాద్ లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లో డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మంజ మల్లేశం, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, మాజీ సర్పంచులు కొండపాక బిక్షపతి, ఏఎంసీ డైరెక్టర్ బైరగోని భాను గౌడ్ ఉన్నారు.

55 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

55 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యంతో పాటు, ఆ బియ్యం అమ్మిన డబ్బులు రూ. 15,980 లను స్వాధీనం చేసుకోని నిందితులపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ రేషన్ బియ్యంను అక్రమంగా రవాణా చేసి, అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం తో టూ టౌన్ పోలీసులతో కలసి వెళ్లి రైడ్ చేసి 55 క్వింటాళ్ల బియ్యంను పట్టుకుని సిద్దిపేటకు చెందిన మాడ శ్రీనివాస్, తూర్పటి అశోక్, వానరాశి సంజీవ్‌లతో పాటు, నిజాంపేట్ కు చెందిన కోదండమ్ శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరం పై పోలీసుల దాడి

- 10మంది వ్యక్తుల అరెస్ట్

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పేకాట స్థావరం పై దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 8,365 వేలు, 11మొబైల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగీలా దాబా చౌరస్తా సమీపంలో లారీ అసోసియేషన్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో లారీ వెనక క్యాబిన్లో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తాము టూ టౌన్ పోలీసులు కలిసి వెళ్లి రైడ్ చేసి 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- ఆస్తి పంపకాలలో తండ్రితో గొడవ



నవతెలంగాణ- దుబ్బాక రూరల్

ఆస్తి పంకాలలో తండ్రి కొడుకు మధ్య మనస్పర్ధలు తలెత్తి క్షణికావేశంతో కొడుకు గడ్డి మందు గుళికలు మింగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద్ద గుండవెళ్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద గుండవెళ్లి గ్రామానికి చెందిన గంట వెంకయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.తన భార్య పేరునా ఆరు ఎకరాల భూమిని (లావని పట్టా)వెంకయ్య ఇద్దరి కుమారులకు సమానంగా పంచి సాగు చేసుకోవాలని అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తానని తెలిపాడు. భూమి రిజిస్ట్రేషన్ తో పాటు మరికొంత ఆస్తి పంపకాల విషయంలో తండ్రితో బాలయ్య(39)ఈ నెల 3న గొడవపడ్డాడు. వెంటనే క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి గడ్డి మందు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు విషయం గమనించిన మెరుగైన చికిత్స కోసం 108 లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

హైర్ బస్ డ్రైవర్స్ శాఖా కార్యదర్శిగా దత్తు ఏకగ్రీవంగా ఎన్నిక



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రం హైర్ బస్ డ్రైవర్స్ సీపీఎం శాఖ కార్యదర్శిగా బి.దత్తు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైర్ బస్ డ్రైవర్స్ శాఖ మహాసభ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు పాల్గొని మాట్లాడారు. గత మహాసభ నుంచి నిర్వహి ంచిన కార్యకలాపాలను చర్చించారు. కార్యదర్శి గా ఎన్నికైన దత్తు మాట్లాడుతూ మహాసభలో నిర్దేశించిన భవిష్యత్ కర్తవ్యాల్లో భాగంగా రాబోయే కాలంలో హైర్ బస్ డ్రైవర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటలు చేస్తామన్నారు.

సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమిస్తాం

- తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ
- సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్









నవతెలంగాణ-గజ్వేల్

వీర తెలంగాణ సాయిధ రైతంగా పోరాటం స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో అమరవీరుల సంస్మరణ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ వారోత్సవాలను గజ్వేల్ పట్టణంలో నిర్వహించడం జరిగింది. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లో విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం కోలాభిరామ్ గార్డెన్ లో జరిగిన సభలో మాట్లాడుతూ ఎర్రజెండాల నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం1946 నుంచి 1951 వరకు జరిగిందని అన్నారు. నైజం సంస్థానంలో జమీందారులు జాగిర్దారులు దేశ్ముకులు దేశ్పాండేలు విచ్చలవిడిగా ప్రజలపై పన్నులు విధిస్తూ అక్రమంగా భూములు గుంజుకోవడం జరిగిందని, నిత్యవసర సరుకులను కోళ్లను బలవంతంగా గుంజుకుని వెళ్లేవారని వారితో పాటు పోలీస్ యంత్రాంగం రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించే వారిని అన్నారు. కౌలు వ్యవసాయం చేసుకొని బ్రతుకుతున్న చాకలి ఐలమ్మను పంటను విసునూరు జమిందార్ అక్రమంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయగా సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అడ్డుకోవడం జరిగిందని అన్నారు. మహిళలు చిన్నపిల్లలకు పాలుగా పోనివ్వకుండా వేధింపులకు గురి చేశారని అన్నారు. బైరాన్ పల్లిలో 116 మందిని కాల్చి సజీవ దహనం జరిగిందని పాలకుర్తిలో వందమందికి పైగా చంపడం జరిగిందని అనేక మందిని గడ్డి వాములో వేసి దహనం చేయడం జరిగిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామంలో సంఘాలుగా ఏర్పడి నైజాం జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. దీని ఫలితంగా దొరలు గ్రామీణ ప్రాంతాలను వదిలి పట్టణాలకు పోయారని తెలిపారు. దీంతో నైజాం సర్కార్ కాంగ్రెస్ తో కలిసిపోయి ఐదు రోజుల్లో భారతదేశంలో విలీనం చేశాడని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఎదగకుండా కుట్రలు చేసి నైజాం శిక్షలు వేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.50 లక్షల వేతనం ఇచ్చిందని, స్వతంత్ర పోరాటంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాత్రలేని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లో తెలంగాణ పోరాటాన్ని వక్రీకరణ చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం దోపిడి వ్యతిరేక పోరాటం అని కులం మతం ప్రాంతాలకు అతీతంగా మాగ్దూంమొయినుద్దీన్ సోయబుల్లాఖాన్, బందగి ఇలాంటి ముస్లిం పౌరులు భీమ్ రెడ్డి నరసింహారెడ్డి మల్లు వెంకట నరసింహారెడ్డి మల్లు స్వరాజ్యం పుచ్చలపల్లి సుందరయ్య రామచంద్రారెడ్డి నల్ల నర్సింలుబద్దం ఎల్లారెడ్డి ఆరుట్ల కమలాదేవి అనేక మంది పోరాటం నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. 1946 జూలై 4న దొడ్డి కొమురయ్య మరణంతో తెలంగాణ వ్యాప్తంగా పోరాటం ప్రారంభమైందని, చాకలి ఐలమ్మ అనేకమంది ప్రాణాల త్యాగం చేసి పోరాటం నిర్వహించారని పేర్కొన్నారు. ప్రస్తుతం నాటి పోరాట ఫలితంగా లభించిన భూములు మరల కంపెనీలకు భూస్వాములకు కట్టబెట్టడం జరుగుతుందని పరిశ్రమలో కార్మికులకు కనీస వేతనాలు లేవని ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ పేరుతో కార్మికులను చేస్తుందని వేతనాల పెంచుటకై సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కామణి గోపాలస్వామి, శశిధర్, రవి ,బండ్ల స్వామి, రంగారెడ్డి, ప్రశాంత్, అరుణ్, వెంకట చారి, ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, కనుకయ్య అహ్మద్, బాబురావు, ఎల్లం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

చాకలి ఐలమ్మ తెగువను ప్రదర్శించి ప్రయివేటీకరణను అనుసరిస్తున్న ప్రభుత్వాలపై పోరాడాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. వీరనారి చాకలి ఐలమ్మ 39 వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట మావో మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పెట్టి చాకిరి విముక్తి కోసం, సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాటి దొరలు, భూస్వాముల, రజాకారుల గుండాలపై తెగువతో చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు ప్రయివేటీకరణ పేరుతో పేద, సామాన్య ప్రజల హక్కులను హరిస్తూ ప్రజలపై అనేక భారాలు మోపుతు ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు కార్పోరేట్ వ్యక్తులకు ధారాదత్వం చేస్తున్న నేటి పాలకులపై పోరాటాలు నిర్వహించాలని ఇదే చాకలి ఐలమ్మ కు అందించే నిజమైన నివాళులని అన్నారు. నాడు జరిగిన పోరాటం వల్ల పేదలందరికీ భూమి దక్కిందని వెట్టి చాకిరిపోయి ఆత్మ గౌరవం వచ్చిందని, దొరల, భూస్వామ్య వ్యవస్థ, నిరంకుశ నిజాం పాలన అంతమొందించబడిందని తెలిపారు. ఈరోజు అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రయివేటు వ్యక్తులకు అప్పనంగా అప్పగిస్తూ పేద మధ్యతరగతి ప్రజల కు చెందాల్సిన హక్కులను కాలరాస్తూ విద్యా, వైద్యం, ఉపాధికి దూరం చేస్తూ కనీస వేతనాలను అమలు చేయకుండా ప్రజలను పీడనకు గురి చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ఇప్పకాయల శోభ, మండల నాయకులు గొర్రె శ్రీనివాస్, ఎండి. ఎజాస్, గుండ్ర రవీందర్, యాడారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- కొమురవెల్లి

వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీ(ఎం) పార్టీ మండల కార్యదర్శి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయం లో వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ విసునూరు దొరను ఎదిరించిన ధైర్యశాలి వీర వనిత ఐలమ్మ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అండతో మల్లు స్వరాజ్యం, కృష్ణమూర్తి నాయకత్వంలో ఐలమ్మ తను పండించిన పంటను దక్కించుకోవడానికి అమోఘమైన పోరాటం నిర్వహించిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తుందని తెలిపారు. నాడు భూమి కోసం భుక్తి కోసం జరిగిన పోరాటంలో అనేకమంది వీరమరణం పొందారని వారి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నేడు పాలకులు అవలంబిస్తున్న ప్రజా, రైతాంగ ,కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, అత్తిని శారద, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండల కేంద్రంలోని మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ఆర్అండ్ఆర్ కాలనీలో సీపీఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39 వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివలింగు కృష్ణ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట పటిమ, తెగువతనంతో అలుపెరుగని పోరాటం చేశారని ఆయన అన్నారు. అదేవిధంగా చాకలి ఐలమ్మ తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత అని తెలిపారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలిగా పేర్కొన్నారు. కావున చాకలి ఐలమ్మ లాంటి పోరాట పటిమ నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములఘట్ రజక సంఘం అధ్యక్షులు, పల్లెపహాడ్ గ్రామ సీపీఐ పార్టీ నాయకులు పోచయ్య, రాజం, బిక్షపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యం







నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పౌష్టికాహారంతోనే గర్భవతులు బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత అన్నారు. మంగళ వారం ఐసీడీఎస్ ఆధ్వ ర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో గర్భిణీలకు సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రజిత మాట్లాడుతూ పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులకు సంపూర్ణ పోషక ఆహారాన్ని అందించాలన్నారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను, రోగ నిరోధక శక్తిని పెంచే కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ అధికారి జయ, కోమటి స్వర్ణలత, వాలా సుప్రజా నవీన్ రావు, బొజ్జ హరీష్ కౌన్సిలర్లు, సూపర్వైజర్‌లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లి బిడ్డలు సంరక్షణగా ఉంటారని వారు ఎదుగుదల ఆరోగ్యవంతంగా ఉంటారని దుబ్బాక ప్రాజెక్ట్ ఇన్చార్జి సీడీపీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రం మహిళా సమైక్య భవనంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతు ందన్నారు. గర్భిణలకు, బాలింతలకు, కిశోర బాలికలకు, పోషకాహర పదార్థాల ప్రదర్శన ద్వారా నిర్వహించి, వాటి విలువలపై అవహగాహన కల్పించారు. సరైన పోషణ ,ఆరోగ్య తెలంగాణ -పోషణ లోపం ఏ ఊరిలో కనిపించ కూడదు. అనే నినాదంతో దుబ్బాక ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ప్రతి లబ్దిదారులకు పోషక ఆహారం అందిస్తూ ,వాటి విలువలపైన అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రక్త హీనత,బరువు లోపలకి చెక్ పెట్టేందుకు పెద్ద ఎత్తున పోషణ మాసం కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లలకి అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జహీరుద్దీన్, మండల వైద్యాధికారి డా. నాగరాజు, ఐకేపీ ఏపీఎం యాదగిరి, ఐసీడీఎస్ సూపర్వైసర్లు గిరిజ, పోషన్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యాంసన్, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు భూపతి రెడ్డి, పీఈటీ మోహన్, ఏఎన్ఎం కరుణ కుమారి,హెల్త్ సూపర్వైజర్ ఋతమ్మ, ఆశలు, గర్భిణీ మహిళలు, బాలింతలు మహిళలు, దౌల్తాబాద్ మండల అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

అంగన్వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని గణపూర్ అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు, గర్భవతులు ఉన్న ఇండ్లను పరిశీలించారు. సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. ప్రి స్కూల్ కథలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వేజర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

స్వీయరక్షణతో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

- పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో ఎమ్మెల్యే కవ్వంపల్లి
- గ్రామాభివృద్ధిలో కార్యదర్శులది కీలక పాత్రని సూచన
- గ్రామాల పరిశుభ్రతలో అందరూ భాగాస్వాములవ్వాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-బెజ్జంకి

వర్షాల కాలం దృష్ట్యా ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైపాయిడ్ వంటి జ్వరాల బారిన పడకుండా స్వీకయరక్షణ పాటించాలని..పంచాయతీ కార్యదర్శులు గ్రామాల పరిశు భ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యాధులు ప్రబలకుండా సత్వర చర్యలు చేపట్టాలని అదేశించినట్టు మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండలంలోని అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చేపట్టిన చర్యలు, త్రాగునీరు సరఫరా, మురికి కాల్వల నిర్వహణ, చెత్త సేకరణ, పన్నుల వసూళ్లు, అక్రమ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వర్షాల దృష్ట్యా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కారిం చాలని సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను, కూలిపోయిన ఇండ్లను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించామని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీన్, ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హైడ్రా తరహా అథారిటీకి సన్నహాలు

మండలంలో ప్రభుత్వ భూములు అక్రమించి నిర్మించిన నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పరిశ్రమల వివరాలతో పంచాయతీ కార్యదర్శులు నివేదిక రూపొందించుకుని ఎల్లవేళల సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రా తరహా అథారిటీ ఏర్పాటు చేయడానికి సన్నహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

గజ్వేల్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్ది నరేందర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పెండింగ్ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని మున్సిపల్ పట్టణ బీఆర్ ఎస్ పార్టీ నాయకులు మద్ది నరేందర్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గజ్వేల్ అభివృద్ధి అన్ని రంగాల్లో చెందిందని చివరి దశలో రింగ్ రోడ్డు, రేడియల్, రోడ్ల పూర్తి కావాల్సింది అన్నారు. అదేవిధంగా అర్ధాంతంగా నిలిచిపోయిన కోట మైసమ్మ రోడ్డు మిగిలిపోయిందని అన్నారు. వాటిని పూర్తిచేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో సీసీ రోడ్లు పూర్తి చేయాలని కోరారు. అండర్ డ్రైనేజ్ పనులు ప్రజ్ఞాపూర్, ముట్రాజ్ పల్లి, క్యాసారం, గుండన్నపల్లి, లింగరాజు పల్లి తదితర గ్రామాల్లో ఇంకా చేపట్టలేదని నిధులు మంజూరు చేయించి పూర్తి చేయాల న్నారు. గత ప్రభుత్వం రూ.95 కోట్లు మంజూరు చేసి 60 శాతం పనులు పూర్తి చేసిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి స్పందించి మున్సిపల్ పరిధిలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తి

- రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నారంగారి



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి దొరల పెత్తనన్ని ప్రశ్నించి పోరాడిన ఘనత చిట్యాల చాకలి ఐలమ్మ ది అని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ అన్నారు. మంగళవారం చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతి గుడికందుల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పటిమ చూపిన స్ఫూర్తి భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. జిల్లాలో ప్రతి గ్రామం లో ఐలమ్మ విగ్ర హం ఏర్పాటు చేసే విధంగా రజక సంఘంల నాయకులు ఐకత్యను చాటాలని పిలుపునిచ్చారు. మన హక్కుల సాధన కోసం ఆ దిశగా అడుగులు వేయాలని దేశ చరిత్రలోనే మహోన్నత స్థానం సంపాదిం చిన వీర వనిత మన తల్లి ఐలమ్మ అని కొనియాడారు. 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్న రాష్ట్ర రజక కుల సమాజానికీ ప్రత్యేక ధన్య వాదాలు తెలిజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు చైతన్యవంతులై మన హక్కులకై అన్ని రకాలుగా ఉద్యమాలు చేయడం వాటి దిశగా అడుగులు ముందుకు వేయడం మన ముందున్న లక్ష్యం అని అన్నారు.

మండలానికి ప్రభుత్వ కార్యాలయాలు మంజూరు చేయాలి

- బండి సంజయ్‌ని కలిసిన జిల్లెల రమేష్ గౌడ్



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

నా రా య ఎ ణ రా వు పే ట మండలానికి ప్రభుత్వ కార్యాలయాలు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సోమవారం కరీంనగం "లో స్వగృహంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల రమేష్ గౌడ్ కలిశారు. నారాయణరావు పేట మండలానికి సంబంధించిన మండల ఆఫీసులు లేక అసంతృప్తిగా ఉంది. మండలానికి సంబంధించిన ఆఫీసులు అమల య్యే విధంగా చూడాలని పోలీస్ స్టేషన్ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేయించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ మండలానికి సంబంధించి న సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు

నిరాశ్రయులకు అన్నదానం



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ , యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వాసవి క్లబ్ డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమ శివకుమార్ పుట్టినరోజు సందర్భంగా వారి సతీమణి వనజ సహాయంతో నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చకిలం రవి, యూత్ ప్రెసిడెంట్ అర్వపల్లి హరి కిరణ్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ వాసవి క్లబ్బులు కులమతాలకు అతీతంగా నిరుపేదలకు సేవలు అందిస్తారని అన్నారు. ఎలాంటి లాభా పేక్ష లేకుండా సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ వాసవి క్లబ్ అనే అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షున్ని కలిసిన మాజీ ఎమ్మెల్సీ నాగపురి



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్, ఆయన తనయుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-వెల్దుర్తి

ఈనెల 21 నుండి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులను సన్నద్ధం చేయడం జరుగుతుందని సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం నుంచి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 100 మంది బాలబాలికలు ఈ పోటీలో పాల్గొంటున్నారన్నారు. ఇందులో 16 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలను మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణంలో నర్సాపూర్ నియోజకవర్గ ఆవుల రాజిరెడ్డి సాఫ్ట్‌బాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం మండల నాయకులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.84

విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట

పొలం వద్ద విద్యుత్ షాక్ గురై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడిచన్ పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన నార్లపల్లి ప్రభు (27) మిషన్ భగీరథ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.గత నెల 25న సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ఉన్న మోటారును రిపేర్ చేస్తుండగా కరెంట్ షాక్ కు గురయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం మెదక్‌లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు.అక్కడి నుంచి గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. తండ్రి ముత్యయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

వినాయక మండపాన్ని దర్శించుకున్న మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామంలో గల బీసీ కాలనీ 7 వార్డులో తాజా మాజీ సర్పంచ్ వినాయక మండపాన్ని మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మ నర్సింలు, క్రాంతికుమార్, తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత

-రూ.32,316 నగద అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన రాగి రవి సౌదీ ఆరేబియాలో మృతి చెందిన విషయం విధితమే. మంగళవారం గ్రామంలోని గల్ఫ్ కార్మిక సేవా సమితి సభ్యులు మృతుని కుటుంబానికి రూ.32,316 నగదు అందజేసి ఆర్థిక చేయూతనందించారు. మృతుని కుటుంబానికి సహాయం అందజేసిన గల్ఫ్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమకమైన మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాదులో ఆయన నివాసంలో టీపీసీసీ సెక్రెటరీ గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, ఎల్లా శ్రీనివాసరెడ్డి, సందీప్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-కొల్చారం

వైద్యం కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన కొల్చారం మండలం పైతర గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంటె యాదయ్య గత మూడు రోజుల క్రితం సంగారెడ్డి ఎంఎన్ఆర్ ఆసుపత్రికి వైద్య చికిత్సల కోసం మెడికల్ క్యాంపులో బాగంగా వెళ్లాడు అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదన్నారు. అదృశ్యమైన యాదయ్య కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ లభ్యమైతే ఈ కింది నంబర్లకు 6309648684, 9618258415 తెలుపగలరని కోరారు.

అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మెదక్ జిల్లా తూప్రాన్ బస్టాండ్ సమీపములో అంబేద్కర్ సంఘం, సుభాష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద మహా అన్నదాన ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, తూప్రాన్ మున్సిపాలిటీ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, ఉమా సత్య లింగం, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, డాక్టర్ అసోసియేషన్ సమన్వయకర్త డాక్టర్ కల్లూరి సంతోష్, ప్రజా ప్రతినిధులు అంబేద్కర్ సంఘం నాయకులు హాజరై గణనాథునికి విశేష పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు సర్గల నర్సింగరావు, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆచరణీయం

నవతెలంగాణ-మద్దూరు

చాకలి ఐలమ్మ స్ఫూర్తి ఆదర్శనీయమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ 39 వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) మద్దూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరలకు ఎదురు నిలిచి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆమె ధైర్య సాహసాలు ఆమె స్ఫూర్తితో సాయుధ పోరాటం మరింత ఉవ్వెత్తున లేసిందని తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండి షఫీ, అల్ల రమేష్ నాయకులు పిట్టల నరేష్, ఇట్టమైన పరమేష్ , పిడిశెట్టి రాజు, ఫసి మహమ్మద్, చెంచల అశోక్, ఎల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సిరిసిల్ల రోడ్‌లో గల చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్ గ్యాదరి రవి, బీఆర్ఎస్ నాయకులు భూంపల్లి శ్రీహరి, ములకల కనకరాజులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందారులను ఎదిరించి తన భూమిని కాపాడుకున్న వీరనారి అని అన్నారు. మహిళ ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోలని అన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

దగాపడ్డ తెలంగాణ, పేద ప్రజలకు భూమి, భుక్తి కోసం పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పెట శంకర్, ఉపాధ్యక్షులు గోనెపల్లి శివ ప్రసాద్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, నంగునూరు సీనియర్ నాయకులు గొరబోయిన సంపత్ కుమార్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన మర్కుక్‌లోని ప్రధాన కూడలి వద్ద రజక సంఘం నాయకులు పొపోల్ల రాజు రజక అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక తెలంగాణ తల్లి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు బహుజన వీర నారి చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ రజక సంఘం అధ్యక్షులు కర్రోళ్ల కరుణాకర్, సీనియర్ నాయకులు లింగ సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రజక సంఘం సభ్యులు, తదితరులున్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా పాతబస్తీలో ఉన్న చాకలి ఐలమ్మ భవనం వద్ద ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శివ రాజయ్య, రాములు, మల్లేశం బాలయ్య, స్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ వహీద్ ఖాన్, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ ఆధ్వర్యంలో

చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో కాంగ్రెస్ నాయకుడు బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు కన్నా యాదవ్, మర్కుక్ మండల రజక సంఘం నాయకుడు ఎర్రబాగు రఘుపతి,దొమ్మాట కనకయ్య రజక, గౌడ సంఘం నాయకుడు మామిడి సురేష్ గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ సాయుధ రైతంగ పోరాట యోధురాలు చాకలి చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం వెలికట్ట , బంగారం గ్రామాల్లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బాల నరసయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వీర తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం, రజాకార్లకు, ముష్కర్లకు, జాగిరిదారులు, జమీందారులు, దొరలకు, దుర్మార్గులకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటంలో చాకలి చిట్యాల ఐలమ్మ కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ముదోజు కనకచారి, కె.కనకయ్య, రాగల దుర్గయ్య, సీఐటీయూ నాయకులు బర్ల కొమురయ్య, బెల్లమయ్య, బాల్ లక్ష్మి, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

వీరనారి చాకలి ఐలమ్మ సిద్ధాంతాలను భావితరాల ప్రజలు పాటించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ పుర్మ వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్, యూత్ ఇంచార్జి శివగారి అంజయ్య, పట్టణ కార్యదర్శి బురగోని తిరుపతి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- కొమురవెల్లి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను మండలంలోని రాంసాగర్ లో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట పటిమను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాడూరి మహేందర్, రాజలింగం నరేష్,ప్రశాంత్, తది తరులుపాల్గొన్నారు

నవతెలంగాణ-దుబ్బాక

'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పటేల్, పట్వారి వ్యవస్థలను ఎదిరించి 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన వీరనారి చాకలి ఐలమ్మ' అని సీపీఐ(ఎం) సిద్ది పేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.భాస్కర్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యురాలిగా చేరి భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఆమె విగ్రహానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళు లు అర్పించారు. దేశంలో జరుగుతున్న అరాచకత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఐకమత్యంతో పోరాడాలని, అదే చాకలి ఐలమ్మకు మనమిచ్చే నిజమైన నివాళులని స్పష్టం చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎం) దుబ్బాక మండల నాయకులు కొంపల్లి భాస్కర్, మల్లేశం, సాజిద్, ప్రశాంత్, నర్సింలు, షాదుల్లా, అల్లావుద్దీన్, రాజు పలువురున్నారు.

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో

చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి ఐద్వా సిద్ది పేట జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. నేటి యువతరం ఐలమ్మ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఐద్వా నాయకులు మానస, వాణి, ఎల్లవ పలువురు ఉన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని అంబేద్కర్ చౌరస్తాలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, నాయకులు తదితరులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ- జగదేవపూర్

జగదేవ్ పూర్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండల రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ లో స్థానిక ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. కాగా చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని తీగుల్, అలిరాజపేట, పీర్లపల్లి, బస్వాపూర్, మునిగడప, వట్టిపల్లి, తదితర గ్రామాల్లోని రజక సంఘాల నాయకులు ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మట్టి గణపతి ప్రతిష్టించిన నెంటూర్ హనుమాన్ భక్త బృందం

నవతెలంగాణ-వర్గల్

మట్టి వినాయకున్ని ప్రతిష్టించిన నెంటూర్ హనుమాన్ భక్త బృందాన్ని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు రామరాజు మంగళవారం ఘనంగా సన్మానించారు. అయితే మట్టి గణపతులు ప్రతిష్టించాలని రెండు దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు రామకోటి సంస్థ ఆధ్వర్యంలో రామరాజు కృషి చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో జరిగే అనర్థాలను దృష్టిలో పెట్టుకొని నెంటూర్ హనుమాన్ భక్త బృందం నాలుగు సంవత్సరాలుగా మట్టి వినాయకుని తయారుచేసి ప్రతిష్టిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యకర వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ భూమి, వాయు, నీటి కాలుష్య నివారణ పట్ల అప్రమత్తంగా ఉండాలని రామకోటి రామరాజు వివరించారు.

వినాయక నిమజ్జనోత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- ఏసీపీ మధు

నవతెలంగాణ-దుబ్బాక

వినాయక నిమజ్జనోత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని సీఐ కార్యాలయంలో పలు వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో సీఐ పీ.శ్రీనివాస్,ఎస్ఐ వీ.గంగరాజు తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు నిమజ్జనం రోజున ప్రతి వినాయకుడి వద్ద నలుగురు వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, పలు వినాయక విగ్రహాల మండపాల నిర్వాహకులు ఉన్నారు.

మైనార్టీ పెద్దలతో డీఎస్పీ చర్చలు

-మైనార్టీ పెద్దలతో డీఎస్పీ చర్చలు

నవతెలంగాణ-తూప్రాన్

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మిలాద్-ఉన్-నబి పండగ కూడా వస్తుంది. మిలాద్ ఉన్ నబి పండుగను 16వ తారీకు నుంచి 19వ తారీకు వాయిదా వేసుకోవడం కొసమని డీఎస్పీ వెంకట్ రెడ్డి కోరడం మైనార్టీ పెద్దలను కోరారు. అందుకు ముస్లిం మత పెద్దలందరూ ఒప్పుకుని వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబి పండుగను ప్రశాంతంగా నిర్వహించు కుంటా మని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్సై శివానంద్, ముస్లిం మైనార్టీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.